# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక








ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 187 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య పేజిలు : 8 వెల రూ. 2 బుధవారం -07 - అక్టోంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana


## భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడింది

- భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య




భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మిగతా 2లో

## ఈజీ వే లేదా హార్డ్ వే.. ఇరాన్‌కు ట్రంప్ స్వీట్ వార్నింగ్

- ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.
- ఇరాన్‌పై త్వరలోనే కీలక నిర్ణయం తీసుకుంటానని ప్రకటించిన ట్రంప్.. టెహ్రాన్ ముందు రెండు మార్గాలే ఉన్నాయని హెచ్చరించారు.



ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై త్వరలోనే కీలక నిర్ణయం తీసుకుంటానని ప్రకటించిన ట్రంప్.. టెహ్రాన్ ముందు రెండు మార్గాలే ఉన్నాయని హెచ్చరించారు. అవి.. 'ఈజీ వే.. లేదా హార్డ్ వే' అంటూ మిగతా 2లో

## 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష



- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. మిగతా 2లో

### ఆస్పత్రులు పూర్తయ్యేలోపే సిబ్బంది

## సిద్ధంగా ఉండాలి

### అత్యాధునిక పరికరాలు ముందుగానే సమకూర్చాలి

- ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల ం పనుల్లో వేగం పెంచాలి
- కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రులు తనిఖీ చేయాలి
- సీఎంవో అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.
- నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆస్పత్రుల పనులను వేగవంతం చేయడంతోపాటు, అవి అందుబాటులోకి వచ్చే నాటికి వైద్యులు, వైద్య సిబ్బంది, అత్యాధునిక పరికరాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు.
- సీఎంవో అధికారులతో నిర్వహించిన సమీక్షలో విద్య, వైద్యం, సీజనల్ వ్యాధులు, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లపై సీఎం చర్చించారు.
- ల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిని సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు.



రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆస్పత్రుల పనులను వేగవంతం చేయడంతోపాటు, అవి అందుబాటు లోకి వచ్చే నాటికి వైద్యులు, వైద్య సిబ్బంది, అత్యాధునిక పరికరాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు .సీఎంవో అధికారుల తో నిర్వహించిన సమీక్షలో విద్య, వైద్యం, సీజనల్ వ్యాధులు, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లపై సీఎం చర్చించారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిని సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు .ఆస్పత్రుల నిర్మాణం పూర్తయిన తర్వాత వైద్య సేవలు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టడంలో ఆలస్యం జరగకూడదని ఆదేశించారు. ఇందుకోసం ఆయా ఆస్పత్రుల్లో మిగతా 2లో

## ఖర్గే వ్యాఖ్యలు ప్రజల విచక్షణను అవమానించడమే



- దేశంలో జరిగిన ఎన్నికలన్నీ బూటకమని, వాటిని రద్దు చేయాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ప్రకటన దేశ పౌరుల విచక్షణను అవమానించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు.
- వ్యవస్థలను బలహీనపరచి తద్వారా దేశ సమగ్రతకు భంగం కలిగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

దేశంలో జరిగిన ఎన్నికలన్నీ బూటకమని, వాటిని రద్దు చేయాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ప్రకటన దేశ పౌరుల విచక్షణను అవమానించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. వ్యవస్థలను బలహీనపరచి తద్వారా దేశ సమగ్రతకు భంగం కలిగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మిగతా 2లో

## వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో 'స్థితప్రజ్ఞుడు' పుస్తకావిష్కరణ

### పుస్తకాన్ని ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రావ

- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్, టెక్నోక్రాట్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ రచించిన 'స్థితప్రజ్ఞుడు' పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.



- మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ రాజకీయ జీవనయానం, ఆయన రాజకీయ ప్రస్థానంలోని వివిధ ఘట్టాలు, నాయకత్వ లక్షణాలను సమగ్రంగా సంకలనం చేస్తూ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ ఈ పుస్తకాన్ని రచించారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్, టెక్నోక్రాట్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ రచించిన 'స్థితప్రజ్ఞుడు' పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ రాజకీయ జీవనయానం, ఆయన రాజకీయ ప్రస్థానంలోని వివిధ ఘట్టాలు, నాయకత్వ లక్షణాలను మిగతా 2లో

### రామప్ప సమీపంలో ఓపెన్‌కాస్ట్.. ఆపకుంటే ఉద్యమమే



రామప్పను కాపాడేందుకు పెద్దఎత్తున ఉద్యమిస్తాం: కేటీఆర్

ప్రఖ్యాత దేవాలయం రామప్పకు సమీపంలో ఓపెన్ కాస్ట్ గని ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆలయం పరిసరాల్లో బొగ్గుగని ప్రతిపాదన వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు.

ప్రఖ్యాత దేవాలయం రామప్పకు సమీపంలో ఓపెన్ కాస్ట్ గని ఏర్పాటు చేయడం పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా 2లో

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

### పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నాం

- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ



"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. మిగతా 2లో

## ఎన్నికలపై నటుడు ప్రకాశ్‌రాజ్ మాటలు వింటే నవ్వు వస్తోంది



- కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేతలు ఓటు చోరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు.
- కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఎన్నికలు రద్దు చేయాలని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేతలు ఓటు చోరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఎన్నికలు రద్దు చేయాలని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే మిగతా 2లో

### వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం

## చెప్పే ధైర్యం ఉందా?

### ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ 2.0 పనులు ప్రారంభం

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చేతుల మీదుగా శ్రీకారం
- రూ. 30,156 కోట్లతో రాష్ట్రవ్యాప్త తాగునీటి పథకం
- 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు లక్ష్యం
- గండికోట నుంచి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు నీరు
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార' పథకం
- ప్రారంభించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- 90 లక్షల కుటుంబాలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం
- రాయలసీమను హార్టికల్చర్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని హామీ
- ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి మిగతా 2లో

## 'రాయలసీమ ద్రోహి చంద్రబాబు'



- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమకు చేసిందేమీ లేదని, ఒకవేళ చేసిందేమైనా ఉంటే బహిరంగంగా చెప్పాలని వైఎస్సార్‌సీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు.
- 40 ఏళ్లుగా చూస్తే రాయలసీమ ప్రజలను చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని రాచమల్ల విమర్శించారు.

ప్రొద్దుటూరు(వైఎస్సార్ కడప జిల్లా): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమకు చేసిందేమీ లేదని, ఒకవేళ చేసిందేమైనా ఉంటే బహిరంగంగా చెప్పాలని మిగతా 2లో

మహి న్యూస్
www.mahinewsindia.com
MAHI NEWS Epaper: https://epaper.mahinewsindia.com తెలుగు దినపత్రిక



## భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడింది

ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు.సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు.భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి.ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

## ఈజీ వే లేదా హార్డ్ వే.. ఇరాన్‌కు ట్రంప్ స్వీట్ వార్నింగ్

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్న ఆయన.. అమెరికా తదుపరి చర్య ఏంటనేది త్వరలోనే తెలుస్తానన్నారు. అయితే, తాను తీసుకోబోయే నిర్ణయం సైనిక చర్యా, దౌత్యపరమైన చర్యా అన్నదానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.వైట్‌హౌస్ నుంచి ఒహియోకు బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్‌పై తమ తదుపరి వ్యూహాన్ని ఖరారు చేస్తున్నట్లు చెప్పారు. ఇరాన్ ఇప్పటికే ధ్వంసమైంది. ఇప్పుడు అది సులభమైన మార్గమా.. కఠినమైన మార్గమా అన్నదే ప్రశ్న అన్న ఆయన వ్యాఖ్యలు పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యం సాధించే ప్రయత్నాలను దాదాపు విరమించుకుంటోందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. అలాగే, అమెరికా మిత్రదేశాలకు చెందిన లక్ష్యాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. అదే సమయంలో కొత్త ఘర్షణను నివారించేందుకు ఇరాన్ దౌత్య ప్రయత్నాలు కొనసాగిస్తోంది.ట్రంప్ తాజా వ్యాఖ్యలకు ముందు అమెరికా అత్యున్నత జాతీయ భద్రతా అధికారులు క్యాంప్ డేవిడ్‌లో రహస్య సమావేశం నిర్వహించారు. ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, దౌత్య చర్చలు, అవసరమైతే తిరిగి భారీ సైనిక చర్య చేపట్టే అవకాశాలపై ఈ భేటీలో చర్చించినట్లుాఇఅశీం తెలిపింది. యెమెన్‌లో సౌదీ అరేబియా-హౌతీ ఘర్షణలపై అమెరికా విధానంపైనా చర్చ జరిగినట్లు సమాచారం. దౌత్యపరమైన చర్చలు ప్రతిష్ఠంభనలో ఉన్న సమయంలోనే ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చల ద్వారా పరిష్కారం లభించకపోతే ఇరాన్‌పై అమెరికా మళ్లీ పెద్దఎత్తున సైనిక చర్యకు దిగే అవకాశాలను ట్రంప్ ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి.మరోవైపు అమెరికా మళ్లీ భారీ స్థాయిలో దాడులు ప్రారంభిస్తే గతంలో కంటే మరింత విస్తృతంగా, తీవ్రంగా ప్రతిదాడి చేసేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు రాయిటర్స్ వెల్లడించింది. ఇరాన్ సైనిక కమాండర్లు అమెరికాకు సంబంధించిన లక్ష్యాలతో పాటు.. అమెరికా సైనిక చర్యలకు మద్దతు ఇచ్చే దేశాలు, మధ్యప్రాచ్యం వెలుపల ఉన్న కొన్ని ప్రాంతాలను కూడా లక్ష్యాలుగా పరిగణిస్తున్నట్లు సమాచారం.

## 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష

ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## ఖర్గే వ్యాఖ్యలు ప్రజల విచక్షణను అవమానించడమే

రాహుల్‌గాంధీ, ప్రకాశ్‌రాజ్ లాంటి వారు రాజ్యాంగబద్ధమైన సంస్థలపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు.'ప్రధాని పదవి కేవలం నెహ్రూ-గాంధీ కుటుంబానికి మాత్రమే సొంతమనే రాచరికపు అహంకారంతో ఉన్న కాం గ్రెస్ పార్టీ, ఒక చాయ్‌వాలా వరసగా మూడోసారి ప్రధాని కావడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. వరస ఓటములను తట్టుకోలేక ప్రజాతీర్పును అవమానిస్తోంది' అని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సర్'పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో నిజంలేదని రాంచందర్‌రావు అన్నారు. ఈ ప్రక్రియను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమే నిర్వహిస్తోందన్న విషయాన్ని గుర్తించాలని కాంగట?్రకు సూచించారు. దమ్ముంటే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ఎన్నికల్లో గెలవాలని కాంగట?్రకు బీజేపీ ఎంపీ డీకే అరుణ సవాల్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎ?సలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతూ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయని మండిపడ్డారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఓటమిభయంతోనే కాంగ్రెస్ నేతలు ఎన్నిక జరగకుండా పిటిషన్ వేయించారని ఆరోపించారు.

## ఎన్నికలపై నటుడు ప్రకాశ్‌రాజ్ మాటలు వింటే నవ్వు వస్తోంది

రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై నమ్మకం పోయేలాగా వారు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.ఈరోజు (సోమవారం) ఢిల్లీలో మీడియాతో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ,ఇండియా కూటమి నేతలు ఆయా ఎన్నికల్లో ఓటములతో గుణపాఠం నేర్చుకోవడం లేదని అన్నారు. విశ్వాసనీయత లేని వారిని తీసుకువచ్చి కాంగ్రెస్ అగ్రనేతలు మాట్లాడిస్తున్నారని ఆగ్రహించారు. ఎన్నికల గురించి నటుడు ప్రకాశ్‌రాజ్ చెప్పే మాటలు వింటే నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కారణంగానే భారతీయులకు గౌరవం దక్కుతుందని ఉద్ఘాటించారు.మల్లికార్జున ఖర్గే ఎన్నికల గురించి మాట్లాడుతున్నారని.. కేరళం, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో వారు గెలిచారని.. అప్పుడు ఎందుకు మాట్లాడలేదని మంత్రి సత్యకుమార్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్నికల ప్రక్రియ గురించి తెలిసిన వారు ఇలా మాట్లాడరని చెప్పుకొచ్చారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌వోలు, ప్రభుత్వ అధికారులు ఉంటారని ప్రస్తావించారు. అలాంటప్పుడు ఎన్నికల్లో అవకతవకలు ఎలా జరుగుతాయని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు అసత్య వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 1950 నుంచి 'సర్' ప్రక్రియ జరుగుతోందని.. అది ఒక నిరంతర ప్రక్రియ అని వివరించారు.పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు భారీగా పాల్గొన్నారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ ఎలక్షన్‌లో 92.47 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ప్రస్తావించారు. ఎన్నికల అధికారిపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరపాలని అంటున్నారని.. టెక్నాలజీ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తుంటే కాంగ్రెస్ నేతలకు నచ్చడం లేదని మండిపడ్డారు. 13 కోట్ల మంది ఓట్లు తొలగించారని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని.. అంతమంది ఓట్లను తొలగించలేదని స్పష్టం చేశారు. ఫామ్- 6లో ఒక్క మార్పు కూడా జరగలేదని.. తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎన్నికల అధికారుల మధ్య అభిప్రాయ భేదాలు లేవని.. ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తేల్చిచెప్పారు.

## 'రాయలసీమ ద్రోహి చంద్రబాబు'

వైఎస్సార్‌సీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. 40 ఏళ్లుగా చూస్తే రాయలసీమ ప్రజలను చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని రాచమల్ల విమర్శించారు. రాయలసీమకు చంద్రబాబు ఏం చేశారో చెప్పాలన్నారు. రాయలసీమ ప్రజలు అంటే చంద్రబాబుకు కోపం అని,. రాయలసీమ ద్రోహి చంద్రబాబు అంటూ అభివర్ణించారు.రాయలసీమ ప్రజలకు చంద్రబాబు హరికథలు మాత్రమే చెబుతారంటూ ఎద్దేవా చేశారు. 'వ్యవసాయం దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు. రాయలసీమకు చంద్రబాబు చేసేందేమీ లేదు. 40 ఏళ్లుగా ఇదే జరుగుతూ వస్తుంది. ఏవో హరికథలు మాత్రమే రాయలసీమ ప్రజలకు చెబుతారు చంద్రబాబు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే రాయలసీమ అభివృద్ధి చెందింది. రాయలసీమకు మంచి చేసింది వైఎస్సార్, వైఎస్ జగన్‌లు మాత్రమే. వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో 38 లక్షల 74 వేల కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన జల్ జీవన్ కార్యక్రమాన్ని కేంద్రం ప్రశంసించింది.రూ. 700 కోట్లతో ఉద్దానానికి వైఎస్ జగన్ సురక్షిత మంచి నీరు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ హయాంలో తాళ్లరామాపురంలో అనేక అభివృద్ధి పనులు చేశాం' అని స్పష్టం చేశారు. చంద్రబాబు జీవితం మొత్తం కుట్రలేనని రాచమల్లు మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాయలసీమలో 125 నుంచి 150 మందిని హత్యలు జరిగాయి. కూటమి అధికారంలోకి వచ్చాక కర్నూలు జిల్లా 29 హత్యలు చేశారు. అనంతపురంలో 42 మందిని వెన్నుపోటు పార్టీ నేతలు హత్య చేశారు.శ్రీసత్యసాయి జిల్లాలో 54 మందిని హత్య చేశారు' అని పేర్కొన్నారు.

# ఆస్పత్రులు పూర్తయ్యేలోపే సిబ్బంది సిద్ధంగా ఉండాలి

అవసరమయ్యే వైద్యులు, నర్సులు, పారామెడికల్, ఇతర సిబ్బంది సంఖ్యను ముందుగానే గుర్తించాలన్నారు. సిబ్బంది నియామక ప్రక్రియ ను ఇప్పటి నుంచే ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని సీఎం ఆదేశించారు. అలాగే ఆస్పత్రులకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను ముందుగానే కొనుగోలు చేయాలని చెప్పారు. నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని విభాగాల్లో అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాలి

జిల్లా కలెక్టర్లు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. కలెక్టర్లతోపాటు సంబంధిత అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులను తప్పనిసరిగా సందర్శించాలని స్పష్టంచేశారు. ప్రజలు, విద్యార్థులు, రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రతి జిల్లాలో పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రుల పరిస్థితిపై వారానికోసారి సమీక్ష నిర్వహించాలని సీఎం ఆదేశించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను వెంటనే చేపట్టి, విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లపైనా సమావేశంలో చర్చించారు. సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు శాఖలవారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. ఏర్పాట్లను త్వరలోనే తాను స్వయంగా పరిశీలిస్తానన్నారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జ్‌మెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా అధికారులు ప్రతి వారం సమీక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యంపై సీఎంవో అధికారులతో ఈరోజు (శనివారం) వీజఎ=ఇలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నిర్మాణంలోని ప్రధాన ఆస్పత్రులపై సీఎం ఆరా తీశారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది నియామకాలు పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు.వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను ముందుగానే గుర్తించాలని సీఎం సూచించారు. అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలును వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఆయా ఆస్పత్రులు పూర్తయ్యే నాటికి అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను అధికారులు తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. జిల్లాల్లోని ఆస్పత్రులనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైన చోట ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?

ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు.

గ్రామీణ తాగునీటి కష్టాలకు 'అమరజీవి జలధార'తో చెక్

సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకురావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి" అని వివరించారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు.

రాయలసీమ దశ మార్చేస్తాం.. రత్నాల సీమగా తీర్చిదిద్దుతాం

రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, "ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి" అని అన్నారు."రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

పవన్ కల్యాణ్ నాయకత్వంలో పల్లెల ప్రగతి

కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం" అని ప్రకటించారు.

గొడ్డలి పార్టీకి సూటి ప్రశ్నలు.. ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలి

ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?" అని నిలదీశారు"ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం" అని దుయ్యబట్టారు.

ప్రొద్దుటూరుకు వరాలు.. స్థానిక సమస్యలకు పరిష్కారం

స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, "కేంద్రంలో మోదీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో 'స్థితప్రజ్ఞుడు' పుస్తకావిష్కరణ

సమగ్రంగా సంకలనం చేస్తూ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ ఈ పుస్తకాన్ని రచించారు.ఈ సందర్భంగా శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, శ్రీ వైయస్ జగన్ రాజకీయ ప్రస్థానాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి 'స్థితప్రజ్ఞుడు' పేరుతో పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఒక రాజకీయ నాయకుడి ప్రయాణాన్ని, ఆయన ఎదుర్కొన్న పరిస్థితులను, తీసుకున్న నిర్ణయాలను, ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధాన్ని పుస్తక రూపంలో భద్రపరచడం భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు."శ్రీ వైయస్ జగన్ గారి రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లు ఎదురైనా స్థిరచిత్తంతో ముందుకు సాగిన తీరు ఈ పుస్తకం శీర్షికలోనే ప్రతిబింబిస్తోంది" అని సజ్జల అన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానంలోని ముఖ్య ఘట్టాలను ఒకేచోట చేర్చి పాఠకులకు అందించడం రచయిత చేసిన మంచి ప్రయత్నమని అభినందించారు."రాజకీయ చరిత్రను కేవలం సంఘటనలుగా కాకుండా, వాటి వెనుక ఉన్న పరిస్థితులు, నాయకత్వ ధోరణి, ప్రజలతో ఉన్న సంబంధాన్ని కూడా నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా 'స్థితప్రజ్ఞుడు' ఒక మంచి ప్రయత్నం" అని పేర్కొన్నారు.పుస్తక రచయిత డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మను అభినందించిన సజ్జల రామకృష్ణారెడ్డి, ఈ పుస్తకం పాఠకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రచయిత డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ కల్పలత, ఎంపీఎస్ నాగిరెడ్డి, కొవ్వూరి త్రినాథరెడ్డి, చల్లా మధుసూదన్ రెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో 'స్థితప్రజ్ఞుడు' పుస్తకావిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ ప్రయాణం, ఆయన ఎదుర్కొన్న సవాళ్లను ఆధారంగా చేసుకుని సీనియర్ రచయిత కొత్తపల్లి శ్రీనివాస వర్మ ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడారు. 'స్థితప్రజ్ఞుడు' పేరుతో వైఎస్ జగన్ రాజకీయ ప్రయాణాన్ని పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయం. రాజకీయ నాయకుడిగా ఆయన ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులు, తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, ప్రజలతో ఏర్పరచుకున్న విడదీయరాని అనుబంధాన్ని భావితరాలకు అందించేందుకు ఈ పుస్తకం దోహదపడుతుంది.రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లు ఎదురైనప్పటికీ, వాటన్నింటిని ఎదుర్కొంటూ వైఎస్ జగన్ స్థిర చిత్తంతో ముందుకు సాగిన తీరు అద్భుతం. ఆయన రాజకీయ ప్రస్థానంలోని ముఖ్య ఘట్టాలను ఒకేచోట చేర్చి పాఠకులకు అందించిన రచయిత ప్రయత్నం ప్రశంసనీయమని సజ్జల కొనియాడారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులకు లీగల్ సెల్ గట్టిగా అండగా నిలిచిందని అభినందించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకునేలా సహకరించాలని సూచించారు. నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పోలింగ్ సందర్భంగా ఎదురయ్యే సమస్యలపై వెంటనే స్పందించే వ్యవస్థ ఉండాలన్నారు.

# రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు.2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు.తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు.గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు.

# రామప్ప సమీపంలో ఓపెన్‌కాస్ట్.. ఆపకుంటే ఉద్యమమే

ఆలయం పరిసరాల్లో బొగ్గుగని ప్రతిపాదన వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. లేకపోతే రామప్ప వారసత్వ సంపదకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఈ మాటలు పట్టించుకోకుండా ఆలయానికి హాని చేసే ప్రయత్నాలు చేస్తే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని కేటీఆర్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.కాగా ములుగు జిల్లా, వెంకటాపూర్ గ్రామ పరిధిలో ఓపెన్ కాస్ట్‌ఏర్పాటు చేయడానికి సింగరేణి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ గని ద్వారా దాదాపు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరపాలని నిర్ణయించారు. దీనివల్ల రామప్ప దేవాలయం ప్రత్యేకమైన 'శాండ్‌బాక్స్' (ఇసుక) ఫౌండేషన్‌కు, రామప్ప చెరువు నీటి నిల్వలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని నిపుణులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.సుమారు 5 కిలోమీటర్ల దిగువన ఉండే ఈ మైనింగ్ కారణంగా భూగర్భ జలాల ప్రవాహం మారి, చెరువు నుంచి నీరు కారే ప్రమాదం ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (+ూ×) నివేదికలు హెచ్చరించాయి. ఈ ప్రాజెక్ట్‌ను నిలిపివేయాలని కోరుతూ కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే స్థానిక గ్రామాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై కేటీఆర్ స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు దోచుకోవడం అయిపోయిందని.. ఇప్పుడు భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్టు పెట్టారు.

రామప్పకు తీవ్ర ముప్పు..

రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని హెచ్చరించారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే ఈ కుట్రలను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేటీఆర్ హెచ్చరించారుముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు.

# ఎంఎల్‌సీ ఎన్నికల సన్నాహక సమావేశం

**-పరిగి మండల బిజెపి రూరల్ అధ్యక్షురాలు కావాలి అనసూయ శ్యాంసుందర్**

**అత్యధిక సంఖ్యలో ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌కు బీజేపీ శ్రేణులు కృషి చేయాలి**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): రాబోయే ఎంఎల్‌సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పరిగి మండల బీజేపీ ఆధ్వర్యంలో ఎంఎల్‌సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఎంఎల్‌సీ ఎన్నికల ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌పై బీజేపీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పరిగి మండలం అధ్యక్షురాలు అనసూయ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. రాబోయే ఎంఎల్‌సీ ఎన్నికల కోసం ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంఎల్‌సీ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌ను అత్యధిక సంఖ్యలో చేపట్టి, పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలో పరిగి మండలం నుండి పెద్ద సంఖ్యలో ఓటర్లను నమోదు చేయించేలా ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ ఎంఎల్‌సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని, అందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేస్తున్నాయని అనసూయ శ్యాంసుందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ , సీనియర్ నాయకులు, శ్రీనివాస్ రెడ్డి , జనార్ధన్ రెడ్డి , రమేశ్ , భీమయ్య , మల్లేశ్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట్ రాములు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్ ): పట్టణంలో యాబాజీ గూడ గ్రామానికి చెందిన కురువ వనమాలకు సీఎం రిలీఫ్ అండ్ చెక్కును ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, మాజీ సర్పంచ్ శశిధర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ రాములు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ తాగునీరు.. జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం

**89 జల్ జీవన్ మిషన్ పనులను గడువులోగా పూర్తి చేయాలి**

**70 శాతం పూర్తయిన పనులను వెంటనే ముగించాలి**

**అమరజీవి జలధార కింద 269 పనులకు రూ.189.51 కోట్లు**

**వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు**

**గ్రామీణ పారిశుద్ధ్య పనుల పురోగతిని మరింత పెంచాలి**

కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): జిల్లాలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా జల్ జీవన్ మిషన్ పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశించారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార, నీరు--పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద 89 పనులు పురోగతిలో ఉన్నాయని, 70 శాతం వరకు పూర్తయిన పనులను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. అమరజీవి జలధార కింద 269 పనులకు రూ.189.51 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు లభించిందని తెలిపారు. నీటి వనరుల బలోపేతం, కొత్త నీటి వనరుల ఏర్పాటు, ఓవర్‌హెడ్ రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు. కొత్త బోర్లు ఏర్పాటు చేసే ముందు శాస్త్రీయంగా నీటి లభ్యతను నిర్ధారించాలని, వేసవిలోనూ నీరు లభించే ప్రాంతాల్లోనే బోర్లు వేయాలని స్పష్టం చేశారు. నిధులు ఉన్నాయనే కారణంతో అవసరం లేని బోర్లు వేసి ప్రజాధనాన్ని వృథా చేయొద్దని హెచ్చరించారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌బీఎం గ్రామీణ్ కింద వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల పురోగతి 37 శాతంగా ఉందని, దీనిని మరింత పెంచాలని సూచించారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల పురోగతి 58 శాతంగా ఉండగా, పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ సోక్ పిట్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, ఈఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజల భాగస్వామ్యం కీలకం

**ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు సమగ్ర కార్యాచరణ**

**ఇంటింటి చెత్త సేకరణ, శాస్త్రీయ ప్రాసెసింగ్‌పై ప్రత్యేక దృష్టి**

**సుమారు 6 లక్షల మేర లెగసీ వ్యర్థాల తొలగింపునకు ప్రణాళిక**

**డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి**



కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఏపీపీసీబీ చైర్మన్ డా. పి. కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లో మున్సిపల్, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులతో ఘన వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. పాఠశాల స్థాయి నుంచే వ్యర్థాల వేర్పాటు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. మార్కెట్లు, రైతుబజార్లు, మాంసం మార్కెట్లలో వ్యర్థాలను నిర్దేశిత ప్రాంతాల్లోనే వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి, అక్రమంగా చెత్త వేయకుండా సీసీ కెమెరాలు, యాప్ ఆధారిత పర్యవేక్షణతో పాటు జరిమానాలు విధించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను దశలవారీగా తగ్గించి క్లాత్, జ్యూట్, కాగితపు సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మార్కెట్లలో పారిశుద్ధ్య మౌలిక వసతులను మెరుగుపరచాలని, ఆస్పత్రులు, పాఠశాలలను నిబంధనల మేరకు నిశ్శబ్ద ప్రాంతాలుగా గుర్తించి శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలని సూచించారు.

## వ్యర్థాల నిర్వహణకు సమగ్ర ప్రణాళిక

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు పట్టణాల్లో ఇంటింటి చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చోట ఈ-ఆటోలను అందుబాటులోకి తీసుకురావాలని, వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి ఆర్డీఎఫ్ వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. పొడి వ్యర్థాలను వేరు చేసి రీసైక్లర్లకు అందించేలా చర్యలు తీసుకోవాలని, 17 రూర్బన్ గ్రామ పంచాయతీల్లో లెగసీ వేస్ట్ సర్వేను త్వరగా పూర్తి చేసి పాత వ్యర్థాలను దశలవారీగా తొలగించాలని సూచించారు.

## 6 లక్షల లెగసీ వ్యర్థాల తొలగింపునకు కార్యాచరణ



జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ నుంచి శాస్త్రీయ ప్రాసెసింగ్ వరకు పూర్తి స్థాయి వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. నగరంలో పేరుకుపోయిన సుమారు 6 లక్షల మేర లెగసీ వ్యర్థాలను దశలవారీగా తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. నగరంలోని డ్రైనేజీ సమస్యలను ప్రాంతాల వారీగా గుర్తించి శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కేసీ కెనాల్ పరిసరాల్లో నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సుమారు 12 కిలోమీటర్ల మేర కెనాల్‌లోకి చెత్త చేరకుండా రక్షణ చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎఫ్ఎస్‌టీపీ, ఎస్‌డబ్ల్యూపీసీ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని, సేంద్రీయ వ్యర్థాలతో వర్మీ కంపోస్టు తయారీని ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

# ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ఓటు హక్కును పరిరక్షించాలి

**- పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి**

**ఓటు బచావో**

**- దేశ్ బచావో' నిరసన ర్యాలీలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా పరిగి (మహీ న్యూస్): వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'ఓటు బచావో -- దేశ్ బచావో' భారీ నిరసన ర్యాలీలో పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో, డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ గారి నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ప్రజల ఓట్ల తొలగింపు చర్యలను వ్యతిరేకిస్తూ నాయకులు,



కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ చౌరస్తా మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన "ఓట్ల చోరీ" ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.ప్రజల ఓటు హక్కును కాపాడాలని,ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి , పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, పరిగి ఆత్మ కమిటీ చైర్మన్ కక్కులూరి శ్రీనివాస్ రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి, పరిగి మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట్ రాములు, పరిగి పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి (నస్కల్) దండు అశోక్, నస్కల్ గౌతమ్, జాఫర్ పల్లి సర్పంచ్ మహేష్, పూడూరు పిఎసిఎస్ చైర్మన్ రఘునాథ్ రెడ్డి, పూడూరు మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, ఫిరంగి వెంకటరామిరెడ్డి, సుల్తాన్పూర్ రవికాంత్ రెడ్డి. గనెముని శ్రీనివాస్, దోమ మండల పార్టీ అధ్యక్షుడు శాంత కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ బాగా మహిళా శ్రీనివాస్ గుప్తా, మున్సిపల్ చైర్మన్లు, గ్రంథాలయ, ఆత్మ, మార్కెట్ కమిటీ, సొసైటీ చైర్మన్లు, మండల/టౌన్ అధ్యక్షులు, బ్లాక్ ప్రెసిడెంట్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, కో-ఆపరేటివ్ బ్యాంకు, సొసైటీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మైనారిటీ సెల్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, అధ్యక్షులు, ఇతర అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సిమెంట్ పరిశ్రమల్లో 33 శాతం పచ్చదనం తప్పనిసరి

**కాలుష్య నియంత్రణ నిబంధనలు కచ్చితంగా పాటించాలి**

**ప్రజలు, పంట పొలాలకు కాలుష్యం లేకుండా చర్యలు**

**పరిశ్రమల్లో 6 శాతం ఆర్డీఎఫ్ వినియోగం తప్పనిసరి**

**సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి**




కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): సిమెంట్ పరిశ్రమల్లో తప్పనిసరిగా 33 శాతం పచ్చదనం ఉండేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) చైర్మన్ డా. పి. కృష్ణయ్య ఆదేశించారు. కర్నూలులో రాయలసీమ జిల్లాల్లోని సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో ప్రజలు, పంట పొలాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కాలుష్య నియంత్రణ



చర్యలు చేపట్టాలని సూచించారు. దుమ్ము, ధూళి, వాయు, నీటి, శబ్ద కాలుష్యాలను నియంత్రించడం తో పాటు కాలుష్య నియంత్రణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పరిశ్రమల పరిధిలో 33 శాతం పచ్చదనం పెంచాలని, అవసరమైతే వాణిజ్యపరమైన పండ్ల తోటలను కూడా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. వర్షపు నీటి సంరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన, సిఎస్ఆర్ నిధులతో పరిసర ప్రాంతాల అభివృద్ధికి పరిశ్రమలు సహకరించాలని సూచించారు. సిమెంట్ రవాణా చేసే భారీ వాహనాల వల్ల దెబ్బతింటున్న రహదారుల అభివృద్ధిలోనూ పరిశ్రమలు భాగస్వాములు కావాలని కోరారు.

## 6 శాతం ఆర్డీఎఫ్ వినియోగం

సిమెంట్ పరిశ్రమల్లో ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సూచించారు. నిబంధనల ప్రకారం సిమెంట్ పరిశ్రమలు ప్రత్యామ్నాయ ఇంధనంగా కనీసం 6 శాతం ఆర్డీఎఫ్ (చెత్త నుంచి తయారైన ఇంధనం) వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. మున్సిపల్ వ్యర్థాల నుంచి ఉత్పత్తి అయ్యే ఆర్డీఎఫ్‌ను సిమెంట్ పరిశ్రమలు వినియోగించేలా ఫ్యాక్టరీలను వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలతో అనుసంధానం చేస్తామని చెప్పారు. ఆర్డీఎఫ్ వినియోగంపై వార్షిక నివేదికలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రమేష్, కిషోర్‌రెడ్డి, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ అసంఘిక కార్యకలాపాలపై అవగాహన

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, నేరాల నివారణ లక్ష్యంగా ఈ రోజు వికారాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెల్లవారుజామున 05:00 గంటలకు ప్రారంభించి ఉదయం 08:30 గంటల వరకు సుమారు ఐదు గంటల పాటు విస్తృతంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, స్వయంగా పాల్గొని కాలనీ వాసులతో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజంలో బాధ్యతాయుతంగా, శాంతియుతంగా మరియు మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వ్యక్తులు, అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడే వారు, రౌడీషీటర్లు మరియు ఇతర నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడటం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా సంబంధాలను మరింత బలోపేతం చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు లేదా అసాంఘిక చర్యలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు





నేరాలకు సంబంధం ఉన్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సారి అయిన పత్రాలు లేని మొత్తం 50 ద్విచక్ర వాహనాలు మరియు 01 ఆటోను అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ క్రమంలో 35 క్వార్టర్ మద్యం సీసాలు, 09 బీర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యానికి హానికరంగా ఉండే కల్తీ ఆహార పదార్థాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి గుట్కా, మీరాజ్, కల్తీ ఆయిల్, రసగుల్లాలు, కల్తీ పాపడ్లు, కల్తీ చకోడీలు తదితర ఆహార పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలకు చర్యలు చేపట్టారు. కల్తీ ఆహార పదార్థాలను తయారు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం ద్వారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, హెచ్చరించారు కాలనీలలో నేరాల నివారణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘాను మరింత పెంచాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీ అంజయ్య, టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రఘు కుమార్, మోమిన్‌పేట్ సీఐ శ్రీ వెంకట్, సబ్ డివిజన్ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది, డీఏఆర్ సిబ్బంది, క్యూ.ఆర్.టి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 85 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో పాల్గొని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.



# పేదరికం లేని సమాజ స్థాపనకు కృషి చేద్దాం

**నిరుపేద కుటుంబాలను క్షేత్రస్థాయిలో గుర్తించాలి**

**ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి**

**ఎంపిక ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతానికి ప్రాధాన్యం**

**ట్రైనీ కలెక్టర్ వెంకటేష్**



చిత్తూరు, అక్టోబర్ 6: (మహి న్యూస్): పేదరికం లేని సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలని చిత్తూరు జిల్లా ట్రైనీ కలెక్టర్ వెంకటేష్ పిలుపునిచ్చారు. చిత్తూరు డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిరుపేద కుటుంబాల ఎంపికపై నిర్వహించిన జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ కొందరు పేద కుటుంబాలు వాటిని సద్వినియోగం చేసుకోలేక పేదరికం నుంచి బయటపడలేకపోతున్నారని తెలిపారు. అలాంటి కుటుంబాలను క్షేత్రస్థాయిలో గుర్తించి ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన లేని కుటుంబాలను గుర్తించి వారికి ఆర్థిక భరోసా కల్పించేలా డీఆర్‌డీఏ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ అట్టడుగు స్థాయిలో ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి ఆర్థిక, ఆర్థికేతర సహాయం అందించడం ద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. 'జీరో ప్రాపర్టీ మిషన్'లో భాగంగా నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారి అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. నిరుపేద కుటుంబాల ఎంపికలో గ్రామ సంఘాల పాత్ర కీలకమని, ఎంపిక ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. గ్రామ సంఘాలతో పాటు మండలస్థాయి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. నిరుపేద కుటుంబాల గుర్తింపునకు రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. చిత్తూరు జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, జిల్లాను పేదరికం లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ట్రైనీ కలెక్టర్ కోరారు. సమావేశంలో డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



# భూసేకరణ పనులకు గడువు..
# పెండింగ్ అంశాల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం

**రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయాలి**

**అవార్డు, పరిహారం చెల్లింపుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి**

**మిస్సింగ్ సర్వే నంబర్లు, పెండింగ్ భూములపై ప్రత్యేక దృష్టి**

**శాఖల మధ్య సమన్వయంతో పనులు పూర్తి చేయాలి**




తిరుపతి, అక్టోబర్ 6: (మహి న్యూస్): జిల్లాలో రైల్వే, జాతీయ రహదారులు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి తహసీల్దార్లు, ఆర్డీఓలతో భూసేకరణ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల వారీగా పెండింగ్ అంశాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అవార్డు ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో సంతకాలు, నిధుల బదిలీ, పరిహారం చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గూడూరు--రేణిగుంట రైల్వే ప్రాజెక్టుతో పాటు ఇతర రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన మార్కెట్ విలువల నిర్ధారణ, పరిశీలన, అవార్డు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, డాటెడ్ ల్యాండ్స్, పెండింగ్ భూ విస్తీర్ణాలపై ప్రత్యేక దృష్టి సారించి రికార్డులను పరిశీలించాలని సూచించారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో హ్యాండోవర్ చేసిన భూములు, అవార్డు ప్రక్రియలో ఉన్న సర్వే నంబర్లను సరిపోల్చి మిస్సింగ్ వివరాలను గుర్తించాలని ఆదేశించారు. టిటిడి భూములకు సంబంధించి 22-ఏ నుంచి తొలగించాల్సిన భూముల వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలపై అభ్యంతరాల పరిశీలన, తుది నివేదిక తయారీ, పరిహారం, ఎక్స్‌గ్రేషియా చెల్లింపులను వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జాతీయ రహదారుల పరిధిలో ఆలయాల తరలింపు, ప్రత్యామ్నాయ స్థలాల ఏర్పాటు అంశాలను ఎండోమెంట్స్, టిటిడి, రెవెన్యూ శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే సమీక్ష నాటికి పెండింగ్ అంశాలను పరిష్కరించి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



## కాణిపాక ఆలయంలో వరుణ జపం మరియు వరుణ యాగం





చిత్తూరు జిల్లా కాణిపాకం మహి న్యూస్. అక్టోబర్.: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజవర్గం ఐరాల మండలం,ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాణిపాకం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల పుణ్యక్షేత్రాలు దేవాలయాల నందు వరుణ జపం వరుణ్ యాగం నిర్వహించడం జరిగిందని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏలినో ప్రభావంతో రైతులు, ప్రజలు వర్షాలు పడక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్ని దేవాలయాల నందు ఆగమశాస్త్రం, రిత్విక శాస్త్రం ప్రకారం పండితులు వరుణ జపం, వరుణ యాగం కాణిపాక ఆలయంలో నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ ఈవో పెంచల కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం ఆదేశాల మేరకు కాణిపాక దేవాలయంలో వరుణ్ యాగం, వరుణ జపం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మనీ నాయుడు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్లు, బంగారుపాళ్యం మండల ఏఎంసి చైర్మన్ భాస్కర్ నాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ వేద పండితులు రుత్వికులు ఆలయ అధికారులు భక్తులు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ఏడాదికాలంగా
# పరారీలో ఉన్న నిందితుడు అరెస్ట్...



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం మహి న్యూస్ అక్టోబర్ 6.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం మొగిలి వెంకటగిరి గ్రామానికి చెందిన నిందితుడు టి. సందీప్ తండ్రి టీ. చిన్న రెడ్డప్ప అను ఇతను ఒక సంవత్సర కాలంగా పరారీలో ఉండటంతో చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డ్యూడి ఆదేశాల మేరకు పలమనేరు డిఎస్పి డేగల ప్రభాకర్ పర్యవేక్షణలో బంగారుపాళ్యం ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐ టి. ప్రసాద్ తన సిబ్బందితో కలిసి సోమవారం అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేయడంలో కృషిచేసిన బంగారు పాల్యం పోలీసులను జిల్లా ఎస్పీ తుషార్ డ్యూడి ఐపీఎస్ అభినందించారు.

# డిక్సన్ టెక్నాలజీస్‌లో 400 ఉద్యోగాలు

**అక్టోబర్ 8న తిరుపతి కలెక్టరేట్‌లో ఉద్యోగ మేళా**

**ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ అభ్యర్థులకు అవకాశం**

**ఫ్రెషర్స్‌తో పాటు 2 ఏళ్లలోపు అనుభవం ఉన్నవారికీ అవకాశం**

**వార్షిక వేతనం రూ.1.81 లక్షల నుంచి రూ.2.34 లక్షల వరకు**

తిరుపతి, అక్టోబర్ 6: (మహి న్యూస్): తిరుపతి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో డిక్సన్ టెక్నాలజీస్ (ఇండియా) లిమిటెడ్‌లో ప్రొడక్షన్ లైన్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. అక్టోబర్ 8న తిరుపతి కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు పీజీఆర్ఎస్ హాల్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. మొత్తం 400 ఖాళీలు ఉండగా, ఫ్రెషర్స్‌తో పాటు 0--2 సంవత్సరాల అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉద్యోగ స్థలం తిరుపతిలోనే ఉంటుందని, వార్షిక వేతనం రూ.1,81,356 నుంచి రూ.2,34,036 వరకు ఉంటుందని తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు అర్హులు. ఉత్పత్తి, అసెంబ్లీ విభాగాల్లో పనిచేయడంతో పాటు అవసరాన్ని బట్టి షిఫ్ట్ విధుల్లో పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

**తీసుకురావాల్సిన పత్రాలు**

ఎస్ఎస్‌సీ మార్కుల మెమో జిరాక్స్

ఉన్నత విద్యార్హత మార్కుల మెమో జిరాక్స్

ఆధార్ కార్డు జిరాక్స్

బ్యాంక్ ఖాతా వివరాల జిరాక్స్

పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో

వేదిక: పీజీఆర్ఎస్ హాల్, మొదటి అంతస్తు, కలెక్టరేట్, తిరుపతి--తిరుచానూరు (దామినేడు), తిరుపతి జిల్లా--517503.

అర్హులైన నిరుద్యోగ యువత అవసరమైన ధ్రువపత్రాలతో అక్టోబర్ 8న ఉద్యోగ మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# క్లీన్ ఎనర్జీ దిశగా ఏపీ.. విద్యుత్ సేవలపై ప్రత్యేక దృష్టి

**వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా లక్ష్యం**

**ఆరు నెలల్లో లక్ష రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు**

**విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు**

**సేవా కేంద్రం 1912ను మరింత బలోపేతం చేయాలి**

**ఏపీఎస్పీడీసీఎల్‌లో 46 మందికి కారుణ్య నియామక పత్రాలు**

తిరుపతి, అక్టోబర్ 6: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్‌ను క్లీన్ ఎనర్జీ దిశగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించేందుకు చర్యలు



చేపడుతున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో



విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు అంశాలపై ఆయన సూచనలు చేశారు. రాష్ట్రంలో 100 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయని మంత్రి తెలిపారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.

**రూఫ్‌టాప్ సోలార్‌కు ప్రాధాన్యత**

పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఎంఎన్ఆర్ఈ గణాంకాల ప్రకారం ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఆరు నెలల్లోనే లక్ష సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

**విద్యుత్ వ్యవస్థ బలోపేతం**

ఆర్డీఎస్ఎస్ కింద విద్యుత్ వ్యవస్థ బలోపేతం పనులను వేగవంతం చేయాలని, నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. పీఎం--కుసుమ్ పథకం కింద ఫీడర్ స్థాయిలో సోలరైజేషన్ పనులు వేగవంతం చేసి రైతులకు పగటిపూట 9 గంటల విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**1912 సేవా కేంద్రాన్ని బలోపేతం చేయాలి**

విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రం 1912ను మరింత బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడంతో పాటు సమస్య పరిష్కారంపై వినియోగదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు.

**విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు**

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి గురికాకుండా సాంకేతిక




రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశ్రామిక, వ్యవసాయ విద్యుత్ సర్వీసులను సకాలంలో మంజూరు చేయాలని, కొత్త సబ్‌స్టేషన్ల కోసం స్థల సేకరణ, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

**46 మందికి కారుణ్య నియామక పత్రాలు**

ఏపీఎస్పీడీసీఎల్‌లో కారుణ్య నియామకాల కింద తాజాగా 46 మందికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. గత ఏడాది డిసెంబరులో 50 మందికి, ఈ ఏడాది ఏప్రిల్‌లో 18 మందికి, తాజాగా 46 మందికి నియామకాలు కలిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొత్తం 215 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు, చీఫ్ జనరల్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి దాతల చేయూత

**రూ.10 లక్షల విరాళం అందించిన**

**డాక్టర్ సి.ఆర్. రాజన్, సినీ నటుడు సి.ఆర్. తేజేశ్వర్**

**పలువురు దాతల నుంచి అదనంగా రూ.1.60 లక్షల విరాళాలు**

**దాతలను అభినందించిన కలెక్టర్ సుమిత్ కుమార్**



చిత్తూరు, అక్టోబర్ 6: (మహి న్యూస్): చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి పలువురు దాతలు విరాళాలు అందించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు దాతలు చెక్కులను అందజేశారు. రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సి.ఆర్. రాజన్, ఆయన తనయుడు, సినీ నటుడు సి.ఆర్. తేజేశ్వర్ కలిసి రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. అలాగే టీడీపీ నాయకుడు కిషోర్ రూ.లక్ష, హైకోర్టు న్యాయవాది త్రిమూర్తి రూ.25 వేలు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు విజయ్ కుమార్ రూ.25 వేలు, మారుతి డెంటల్ హాస్పిటల్ వైద్యుడు ప్రదీప్ రూ.10 వేలు విరాళంగా అందించారు. ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన దాతలను కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం. మహి న్యూస్ అక్టోబర్ 6.: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లి గ్రామంలో అప్పుల బాధతో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్‌లో Cr.No.163/2026 U/Sec.194 BNSS కింద కేసు నమోదు చేయబడింది. మృతుడు వి. నారాయణ ఆచారి (50), తండ్రి మాణిక్యం ఆచారి, జంబువారిపల్లి గ్రామం. ఇతను తగ్గువారిపల్లిలోని శ్రీ విఘ్నేశ్వర వుడ్ వర్క్ షాప్‌ను లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నాడు. సుమారు రూ.20 లక్షల అప్పులు, ఆర్థిక ఇబ్బందులు మరియు షాప్ లీజు గడువు ముగియడంతో మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 05-10-2026న మధ్యాహ్నం భోజనం అనంతరం షాప్‌కు వెళ్లిన మృతుడు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో, అతని భార్య లత షాప్‌లో పనిచేసే శంకర్‌ను సంప్రదించింది. శంకర్ షాప్‌కు వెళ్లి చూడగా, మృతుడు షెడ్‌లోని ఇనుప పైపునకు వైర్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే లత, శంకర్, సాంబయ్య ఆచారి కలిసి మృతుడిని కిందకు దించి బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య వి . లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తును జీ . నరసింహులు, అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బంగారుపాళ్యం యుపిఎస్ నిర్వహిస్తున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ. 12 లక్షల విరాళం

**కలెక్టర్‌కు అందజేసిన దాతలు**



చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 6,మహి న్యూస్: స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి చేయూతగా దాతలు ముందుకొచ్చి రూ. 12 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసిన ప్రతినిధి బృందం ఈ మేరకు విరాళాన్ని అందజేసింది. ఆంధ్రప్రదేశ్ వన్నియకుల క్షత్రియ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ సి.ఆర్. రాజన్, సినీ నటుడు తేజ్ సంయుక్తంగా రూ. 10 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించగా, స్థానిక ప్రముఖులు, నాయకులు మరో రూ. 2 లక్షలను సమకూర్చారు. దీంతో మొత్తం విరాళం రూ. 12 లక్షలకు చేరింది. కలెక్టర్‌ను కలిసి విరాళం అందజేసిన వారిలో సి.ఆర్. రాజన్, నటుడు తేజ్, ప్రముఖులు కె. విజయ్ కుమార్, కె. ఉదయ్ కుమార్, మిట్టూరు సీన, మాపాక్షి వినోద్, జయచంద్ర నాయుడు, కె.జి. త్రిమూర్తి, ప్రదీప్ ఉన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ దవాఖాన అభివృద్ధికి ముందుకొచ్చిన దాతలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు

## అప్పలాయగుంటలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

**శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం**



అప్పలాయగుంట,అక్టోబర్ 6,మహి న్యూస్ : అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు మంగళవారం శాస్త్రోక్తంగా, వైభవంగా ప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయంలో పలు వైదిక కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, అర్చన నిర్వహించారు. అనంతరం యాగశాలలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో స్వామివారికి, అమ్మవార్లకు విశేష అభిషేకం చేశారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాల అనంతరం 6.45 గంటల నుంచి పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల వైదిక మంత్రోచ్ఛారణలు, భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అక్టోబరు 07న పవిత్ర సమర్పణ, అక్టోబరు 08న పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఆలయ అర్చకులు సూర్యకుమార్ ఆచార్యులు, ఇతర సిబ్బంది, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనల మేరకు
## యోగిమల్లవరంలో ఘనంగా వరుణ యాగం, వరుణ జపం





యోగిమల్లవరం,అక్టోబర్ 6,మహి న్యూస్: తిరుపతి రూరల్ మండలం యోగిమల్లవరం గ్రామంలోని శ్రీ కామాక్ష్యంబా సమేత శ్రీ పరాశరేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో మంగళవారం (06-10-2026) ఉదయం 6:00 గంటలకు వరుణ యాగం, వరుణ జపం వైభవంగా ప్రారంభమయ్యాయి. చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) సూచనల మేరకు, లోక కళ్యాణార్థం, గ్రామం సుభిక్షంగా ఉండాలని మరియు సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశేష పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోటుపల్లి నీలకంఠం, అర్చకులు మరియు ధర్మకర్తల మండలి సభ్యులు ఎం. మూర్తి గురుకుల్, కార్యనిర్వాహణాధికారి, పాలకమండలి సభ్యులు పి. సురేష్, ఆర్. తులసి, ఎస్. సుభాషిణి, బి. సీతమ్మ, ఎ. పరిమళ, ఎస్. ఎల్లప్ప, ఎన్. శంకర్ రెడ్డి, వి. సంతోష్ కుమార్, ఎక్స్ అఫీషియో సభ్యులు ఎం. గణేష్ ప్రసాద్ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లాలో ఆరు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం

**గ్రామీణ ప్రజలకు చేరువలోనే మెరుగైన వైద్య సేవలు**

**105 రకాల మందులు, 14 రకాల ఉచిత వైద్య పరీక్షలు**

**రాష్ట్రవ్యాప్తంగా 265 కేంద్రాలకు వర్చువల్‌గా శ్రీకారం**

**జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ**




గుంటూరు, అక్టోబర్ 6: (మహి న్యూస్): గ్రామీణ ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గుంటూరు జిల్లాలో ఆరు నూతన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 265 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 105 రకాల మందులు, 14 రకాల ఉచిత వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. గుంటూరు జిల్లాలో లాలుపురం, చేబ్రోలు--2, కొలకలూరు ఉత్తర, కటీవరం, ఈమని--1, ఈమని--2లో కొత్త కేంద్రాలను ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ప్రజల చెంతకే వైద్య సేవలు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సంజీవని వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అందుబాటులోకి వచ్చిన వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మక్కెన పద్మావతి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి. శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఇ. అన్నపూర్ణ, డీపీఎం సుజాత, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయన్ తదితరులు పాల్గొన్నారు.

## బయోచార్ ఉత్పాదకతపై దృష్టి సారించాలి

**నేల సారవంతత, నీటి నిల్వ సామర్థ్యం పెంపునకు బయోచార్ ఉపయోగకరం**

**ఆసక్తి ఉన్న రైతులతో ముందుగా ప్రయోగాత్మకంగా అమలు చేయాలి**

**మిర్చి, పత్తి, ఉలవ పంటల్లో ప్రభావంపై అధ్యయనం చేయాలి**

**ప్రకృతి వ్యవసాయంలో 75 వేల ఎకరాలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి**

**జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ**



గుంటూరు, అక్టోబర్ 6: (మహి న్యూస్): జిల్లాలో బయోచార్ ఉత్పాదకత, వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం బయోచార్ ఉత్పాదకత, వినియోగంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బయోచార్ వినియోగం ద్వారా నేలకు సేంద్రియ కర్బనం అందడంతో పాటు భూసారం పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. నేలలో నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరగడంతో పాటు పంటలకు అవసరమైన పోషకాలను అందించే సూక్ష్మజీవుల వృద్ధికి ఇది దోహదపడుతుందన్నారు. వ్యవసాయ వ్యర్థాలను బహిరంగంగా కాల్చడం తగ్గించడం ద్వారా కాలుష్య నియంత్రణకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. ముందుగా బయోచార్‌పై ఆసక్తి ఉన్న రైతులను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సూచించారు. బయోచార్ వినియోగంపై రైతులకు అవగాహన, నమ్మకం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. బయోచార్‌తో పాటు వర్మీకంపోస్ట్, జీవామృతం వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. మిర్చి, పత్తి, ఉలవ వంటి పంటల్లో బయోచార్ వినియోగం వల్ల పంట ఆరోగ్యం, దిగుబడి, నేల నాణ్యతపై ప్రభావాన్ని అధ్యయనం చేయాలని ఆదేశించారు. బయోమాస్ వినియోగాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం కింద చేపట్టనున్న 75 వేల ఎకరాల్లో బయోచార్ వినియోగానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ప్రాంతంలో ఒక ప్రాజెక్టును ఏర్పాటు చేసి, దాని ఫలితాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మార్పు వసతి గృహాలకు రూఫ్‌టాప్ సోలార్

**జిల్లాలో 36 వసతి గృహాల్లో మౌలిక వసతుల అభివృద్ధి**

**వసతి గృహాల ప్రవేశాలు, వంటగదుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు**

**తాడికొండ, రాజా గార్డెన్‌లో పనులు వెంటనే ప్రారంభించాలి**

**జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ**





గుంటూరు, అక్టోబర్ 6: (మహి న్యూస్): 'మార్పు' కార్యక్రమం కింద జిల్లాలోని 36 వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో 'మార్పు' కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. వసతి గృహాల్లో విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. వసతి గృహాల ప్రవేశ ద్వారాలతో పాటు వంటగదుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాడికొండ, రాజా గార్డెన్ ప్రాంతాల్లోని బీసీ వసతి గృహాలు, గురుకులాల్లో చేపట్టాల్సిన పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతి, భద్రత కల్పించేలా మౌలిక వసతుల పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరమణప్ప, సర్వశిక్షా అభియాన్ ఏపీసీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికలకు పకడ్బందీగా సిద్ధం కావాలి

**ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**ఓటర్ల జాబితాల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు**

**పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి**

**ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలి**



గుంటూరు, అక్టోబర్ 6: (మహి న్యూస్): సాధారణ పురపాలక ఎన్నికలను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించేందుకు అధికారులు



పకడ్బందీగా సమాయత్తం కావాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ సూచించారు. గుంటూరు వైద్య కళాశాల ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ప్రాంతీయ సమాయత్త సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నందున ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేశారు. చిన్న పొరపాట్లు కూడా తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్లు పోలింగ్ కేంద్రాలను స్వయంగా తనిఖీ చేసి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటింగ్‌పై ప్రజలకు ఎలాంటి సందేహాలు లేకుండా స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. మున్సిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులను నిశితంగా పరిశీలించి తప్పులులేని ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి తనిఖీలు పూర్తి చేయాలన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయడంతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, గ్రీన్ కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ల ఎన్నికలు ప్రత్యక్షంగా జరగనున్న నేపథ్యంలో మార్పులకు అనుగుణంగా అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ ఎన్నికల ప్రకటన తర్వాత తక్కువ సమయంలోనే ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని, అందుకు ముందస్తు సన్నాహాలు తప్పనిసరి అన్నారు. బ్యాలెట్ బాక్సుల ద్వారా ఎన్నికలు జరగనున్నందున పోలింగ్ కేంద్రాల నుంచి ప్రతి అంశంపైనా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని, వారికి అందించే హ్యాండ్‌బుక్‌లోని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ముందుగానే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించి స్పష్టత ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ శాఖ ప్రాంతీయ సంచాలకులు సూర్యదేవర



హరికృష్ణ మాట్లాడుతూ గుంటూరు ప్రాంతంలో 33 మున్సిపాలిటీలు ఉండగా, ప్రస్తుతం 24 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా మిగిలిన మున్సిపాలిటీల ఎన్నికలపై నిర్ణయం ఉంటుందని చెప్పారు. మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో, అనంతరం చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఓటు నమోదు చేసుకోండి

**ఎస్‌టీయూ బలపరిచిన జోసెఫ్ సుధీర్ బాబుకు మద్దతు ఇవ్వాలని పిలుపు**




దుర్గి, అక్టోబర్ 6:(మహి న్యూస్): రానున్న ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం దుర్గి మండల శాఖ పిలుపునిచ్చింది. గుంటూరు--కృష్ణా ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎస్‌టీయూ బలపరిచిన జోసెఫ్ సుధీర్ బాబుకు మద్దతు ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరింది. ఈ సందర్భంగా మంగళవారం దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌టీయూ దుర్గి మండల అధ్యక్షుడు వి. మంగళ నాయక్, ప్రధాన కార్యదర్శి యర్రం ఏడుకొండలు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జి.సి.హెచ్. అనంతరామయ్య ఉపాధ్యాయులకు ఫారం-19 అందజేసి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. మార్చి 2027లో జరగనున్న ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు అర్హులైన ఉపాధ్యాయులు సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6 వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో ఫారం-19 ద్వారా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. 2026 నవంబర్ 1 నాటికి గత ఆరు సంవత్సరాల్లో కనీసం మూడు సంవత్సరాలు ప్రభుత్వ గుర్తింపు పొందిన మాధ్యమిక లేదా అంతకంటే ఉన్నత స్థాయి విద్యాసంస్థలో జీత శ్రేణిపై బోధనా సిబ్బందిగా పనిచేసిన వారు నిబంధనల మేరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఫారం-19తో పాటు పాస్‌పోర్టు సైజు రంగు ఫొటో, ఓటరు గుర్తింపు కార్డు వివరాలు, ఆధార్ వివరాలు, సేవా ధ్రువీకరణ పత్రం, మొబైల్ నంబర్ సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే వారికి సంబంధిత ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ సేవా ధ్రువీకరణ పత్రం జారీ చేయాల్సి ఉంటుందని, ప్రైవేట్ విద్యాసంస్థల వారికి సంబంధిత శాఖ జిల్లా స్థాయి అధికారి జారీ చేసిన సేవా ధ్రువీకరణ పత్రం అవసరమని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు తమ శాసనసభ ఓటు ఉన్న మండల తహసీల్దార్ కార్యాలయంలో ఫారం-19 సమర్పించాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని అవసరమైన పత్రాలతో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం వచ్చే దరఖాస్తు సంఖ్యను భద్రపరచుకోవాలని తెలిపారు. ఫారం-19 సమర్పించిన అనంతరం బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చి విచారణ నిర్వహించే అవకాశం ఉన్నందున, సమర్పించిన దరఖాస్తు మరియు జతచేసిన పత్రాల ప్రతులను భద్రపరచుకోవాలని ఎస్‌టీయూ నాయకులు సూచించారు. నవంబర్ 2026 నాటికి పదవీ విరమణ చేసినా, గత ఆరు సంవత్సరాల్లో కనీసం మూడు సంవత్సరాలు అర్హత కలిగిన సంస్థలో పనిచేసిన ఉపాధ్యాయులు నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మాచర్లలోని ఎస్‌టీయూ ప్రాంతీయ కార్యాలయంలో మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలాల ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్‌లైన్ ఉపాధ్యాయ ఓటు నమోదు సదుపాయం కల్పిస్తున్నట్లు నాయకులు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తన ఓటును నమోదు చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

**చిరుమామిళ్ల హైస్కూల్‌లో రూ.46 లక్షలతో ఆధునిక రన్నింగ్ ట్రాక్**

**చదువుతో పాటు విద్యార్థులు ఆరోగ్యం, క్రీడలపై దృష్టి పెట్టాలి**

**స్కిల్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ మంజూరు చేస్తున్నాం**

**పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న దాత రామిరెడ్డి అభినందనీయం**

**జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల**



నరసరావుపేట, అక్టోబర్ 6: (మహి న్యూస్): ప్రభుత్వ పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల తెలిపారు. నాదెండ్ల మండలం చిరుమామిళ్లలోని నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.46 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఆధునిక రన్నింగ్ ట్రాక్, క్రీడా మైదానాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన చిరుమామిళ్ల వాస్తవ్యుడు నడికట్టు రామిరెడ్డి సొంత గ్రామంపై మమకారంతో పాఠశాల అభివృద్ధికి రూ.46 లక్షలు




కేటాయించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే గ్రామంలో కల్యాణ మండపం, తాగునీటి వసతుల కల్పనకు ఆయన సహకరించారని తెలిపారు. తాము ఎదిగిన తర్వాత సొంత ఊరు, చదువుకున్న పాఠశాలను మర్చిపోకూడదనే దానికి రామిరెడ్డి సేవలు నిదర్శనమన్నారు. పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఇలాంటి ఆధునిక క్రీడా వసతులు అరుదని, ఈ రన్నింగ్ ట్రాక్ ద్వారా భవిష్యత్తులో చిరుమామిళ్ల పాఠశాలలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రతిరోజూ కనీసం గంటపాటు రన్నింగ్, యోగా, వాలీబాల్, బాస్కెట్‌బాల్ వంటి వ్యాయామాల్లో పాల్గొనాలని సూచించారు. శారీరకంగా చురుకుగా ఉంటే మానసికంగా కూడా చురుకుదనం పెరుగుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు ఐరన్, పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గత ఏడాది ఈ పాఠశాల నుంచి 11 మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించారని తెలిపారు. ఈ ఏడాది వంద శాతం ఫలితాలతో పాటు మరింత మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు అదనపు మధ్యాహ్న భోజనం, వాలంటీర్ ఉపాధ్యాయుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడేందుకు ఇంగ్లిష్ మాట్లాడటం, కంప్యూటర్ నైపుణ్యాలు అవసరమని తెలిపారు. డిజిటల్ స్క్రీన్ల ద్వారా యాక్టివిటీ ఆధారిత అభ్యసనాన్ని ప్రోత్సహించాలని, చాట్‌జీపీటీ, కృత్రిమ మేధ వంటి సాంకేతికతను విద్యాభ్యాసానికి ఉపయోగించుకోవాలని సూచించారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న నాలుగు గదుల్లో కంప్యూటర్, కృత్రిమ మేధ, వృత్తి విద్యా కోర్సులకు శిక్షణ ఇచ్చేలా స్కిల్ ల్యాబ్, డిజిటల్



లైబ్రరీని ప్రభుత్వం తరఫున మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. అనంతరం చిరుమామిళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన కొందరు తమ ఇళ్లను ఖాళీ చేయాలంటూ నోటీసులు వచ్చాయని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ దాత నడికట్టు రామిరెడ్డి, జిల్లా సర్వశిక్షా అభియాన్ అధికారి శ్యామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేకల కిశోర్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

# భూ పరిపాలన ప్రక్రియలను వేగవంతం చేయాలి

**22ఏ, వెబ్‌ల్యాండ్, పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీపై ప్రత్యేక దృష్టి**

**రీ-సర్వే, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి**

**పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీలో 75 సైకిళ్ల లక్ష్యం**

**ఏపీ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి**




తిరుపతి, అక్టోబర్ 6: (మహి న్యూస్): భూ పరిపాలన, రెవెన్యూ అంశాలకు సంబంధించిన ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని ఏపీ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ), రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఏపీ సచివాలయం నుంచి




మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో 22ఏ, వెబ్‌ల్యాండ్, పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ, రీ-సర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్ ప్రక్రియను



వేగవంతం చేశామని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీలో ఇప్పటికే 38 సైకిళ్లు పూర్తయ్యాయని, మరో 37 సైకిళ్లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. మొత్తం 75 సైకిళ్లను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డీఆర్వో జి. నరసింహులు, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే అధికారి రాంప్రసాద్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాలో 4 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభం

**రాష్ట్రవ్యాప్తంగా 267 క్లినిక్‌లకు వర్చువల్‌గా శ్రీకారం**

**గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దకే ప్రాథమిక వైద్య సేవలు**

**ముందస్తు ఆరోగ్య పరీక్షలు, నివారణ సేవలు అందుబాటులోకి**

**వర్చువల్‌గా ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**




తిరుపతి, అక్టోబర్ 6: (మహి న్యూస్): గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 267 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ వర్చువల్ విధానంలో జిల్లాలోని నాలుగు నూతన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు.



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని బి.వి.పురం, ఆకృతి, వెంకటగిరి నియోజకవర్గంలోని సంగనపల్లి, గూడూరు నియోజకవర్గంలోని దుగ్గరాజుపట్నం క్లినిక్‌లు ప్రారంభమైన వాటిలో ఉన్నాయి. ఈ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్యం, ముందస్తు నివారణ చర్యలు, ఆరోగ్య పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్, 15వ ఆర్థిక సంఘం నిధులతో భవనాలను నిర్మించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వి. బాలకృష్ణ నాయక్, డీపీఆర్ఈఓ డి. మధుసూదన్, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రతే లక్ష్యం.. 18 వాహనాలు స్వాధీనం

**ఆటోలు, సుమోలు, జీపులపై పోలీసు-రవాణా శాఖల ప్రత్యేక తనిఖీలు**

**ప్రయాణికుల మాదిరిగా మారువేషాల్లో తనిఖీలు చేసిన పోలీసులు**



**అధిక చార్జీలు, ఓవర్‌లోడ్‌పై కేసులు**

**సుమారు రూ.లక్ష జరిమానా విధింపు**

తిరుపతి, అక్టోబర్ 6: (మహి న్యూస్): శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రయాణికుల భద్రత, సురక్షిత ప్రజా రవాణాపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ, జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాలతో తిరుపతి రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ఆటోలు, సుమోలు, జీపులపై సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్న వాహనాలను గుర్తించేందుకు పోలీసులు ప్రయాణికుల మాదిరిగా మారువేషాల్లో వాహనాలను మాట్లాడి, గమ్యస్థానాలకు ఎంత చార్జీ వసూలు చేస్తున్నారో పరిశీలించారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన వాహనాలపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో 3 సుమోలు, 2 జీపులు, 13 ఆటోలు.. మొత్తం




18 వాహనాలను స్వాధీనం చేసుకుని సుమారు రూ.లక్ష జరిమానా విధించారు. అధిక చార్జీలతో పాటు పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. ప్రయాణికుల భద్రత విషయంలో రాజీ పడేది లేదని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతికి వచ్చే భక్తులతో డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించాలని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం బాధ్యతగా భావించాలని సూచించారు. ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. పోలీసు, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సేవలు అందిస్తాయని పేర్కొన్నారు. తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు భాస్కర్‌నాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహార లోపం నివారణకు సమష్టి కృషి

**తిరుపతి కలెక్టరేట్‌లో 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమం**

**అంగన్‌వాడీల ద్వారా తల్లులు, పిల్లలకు పోషకాహారంపై అవగాహన**

**తొలి 1000 రోజులు పిల్లల ఎదుగుదలలో కీలకం**

**అర్హులైన ప్రతి మహిళకు మాతృ వందన యోజన ప్రయోజనాలు అందేలా చర్యలు**




తిరుపతి, అక్టోబర్ 6: (మహి న్యూస్): తిరుపతి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. "హమారీ అంగన్‌వాడీ--హమారీ జిమ్మేదారీ" (మన అంగన్‌వాడీ--మన బాధ్యత) ప్రధాన ఇతివృత్తంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గర్భిణీలు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని అధికారులు తెలిపారు. స్థానికంగా లభించే చిరుధాన్యాలు, తక్కువ ఖర్చుతో లభించే ప్రోటీన్ ఆహారాన్ని తీసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.



అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన తాజా వేడి భోజనం అందించడంతో పాటు, పిల్లల మెదడు వికాసానికి తొలి 1000 రోజుల ప్రాధాన్యతపై తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి మాతృ వందన యోజన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూసీడబ్ల్యూ అండ్ ఈఓ వసంతబాయి, నోడల్ అధికారి వాసంతి, వైద్యాధికారి డా. శాంతకుమారి, టాటా ట్రస్ట్ ప్రతినిధి అమరావతి, సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లాలో 8 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ప్రారంభం

**వర్చువల్‌గా ప్రారంభించిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యం**

**ఉచిత మందులు, అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి**

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



చిత్తూరు, అక్టోబర్ 6: (మహి న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ



లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కృష్ణా జిల్లా గుడివాడ నియోజకవర్గంలోని జనార్ధనపురం నుంచి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రాష్ట్రవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాలో 8 గ్రామీణ ఆరోగ్య క్లినిక్‌లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వారి గ్రామాలకు సమీపంలోనే నాణ్యమైన



ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు కీలకంగా నిలుస్తాయని తెలిపారు. ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కేంద్రాల ద్వారా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణతో పాటు ఉచిత మందులు, అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామాల్లోనే వ్యాధులను తొలిదశలో గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. చిత్తూరు జిల్లాలో గంగాధర నెల్లూరు మండలం బుక్కపట్నం, పెనుమూరు మండలం సి.ఆర్. కండ్రిగ, ఎస్.ఆర్.పురం మండలం సెట్టివానత్తం, కుప్పం మండలం కృష్ణదాసనపల్లి, మంకలొడ్డీ, విజయపురం మండలం కోసలనగరం, గంగవరం మండలం కీలపట్ల, వి.కోట మండలం వెంకటగిరికోట-1 గ్రామాల్లో ఈ ఆరోగ్య క్లినిక్‌లు ప్రారంభమయ్యాయి. ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను జాతీయ ఆరోగ్య మిషన్--మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ శశిభూషణ్, అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట ప్రసాద్, డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బస్సులో పరిచయం.. ప్రేమ పేరుతో మోసం

**రూ.20 లక్షల వరకు నగదు, బంగారం తీసుకున్నాడని మహిళ ఆరోపణ**

**ఆర్టీసీ కండక్టర్‌పై విచారణకు మంత్రి ఆదేశం**

**ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం**

తాడేపల్లి, అక్టోబర్ 6: (మహి న్యూస్): బస్సులో పరిచయమైన ఆర్టీసీ కండక్టర్ ప్రేమ పేరుతో మోసం చేసి తన నుంచి సుమారు రూ.20 లక్షల వరకు నగదు, బంగారం తీసుకున్నాడని చంద్రగిరి మండలం కొంగరవారిపల్లెకు చెందిన ఎం. బేబీ శాలిని ఆరోపించారు. తనపై లైంగిక దాడికి కూడా పాల్పడ్డాడని ఆమె ఆరోపిస్తూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. చంద్రగిరి నుంచి తిరుపతికి ప్రతిరోజూ బస్సులో ప్రయాణించే సమయంలో ఆర్టీసీ కండక్టర్ వి. సుబ్రహ్మణ్యంతో పరిచయం ఏర్పడిందని బాధితురాలు తెలిపారు. ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ప్రేమిస్తున్నానని నమ్మించి, వివిధ దశల్లో తన నుంచి నగదు తీసుకున్నాడని ఆరోపించారు. ఫోన్‌పే ద్వారా పలుమార్లు నగదు బదిలీ చేయించుకున్నారని, బంగారం కూడా కొనిపించుకున్నారని పేర్కొన్నారు. తన వద్ద నుంచి తీసుకున్న నగదు, బంగారం తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడని, ప్రేమ పేరుతో తన వెంటపడి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫోన్‌పే లావాదేవీలు, కాల్స్, మెసేజ్‌లు, బంగారం కొనుగోలు బిల్లులు తదితర ఆధారాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



**తిరుపతి ఆర్టీసీ ఆర్ఎంకు మంత్రి ఆదేశాలు**

బాధితురాలి ఫిర్యాదుపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెంటనే తిరుపతి ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్‌కు వీడియో కాల్ చేసి మాట్లాడారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే సంబంధిత కండక్టర్‌పై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో, ముఖ్యంగా మహిళలతో బాధ్యతాయుతంగా, మర్యాదగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బంది ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. బాధితురాలికి చట్టపరంగా న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. మహిళల భద్రత, గౌరవానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

# ఎస్‌ఎస్‌సీ-2027 ఫలితాల మెరుగుదలకు సమగ్ర కార్యాచరణ

**100 రోజుల ప్రత్యేక కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలి**

**6 నుంచి 10వ తరగతి వరకు గణితం, సైన్స్, ఇంగ్లీష్‌పై ప్రత్యేక దృష్టి**

**వెనుకబడిన విద్యార్థులకు రోజూ గంటపాటు ప్రత్యేక తరగతులు**

**విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత: కలెక్టర్ సుమిత్ కుమార్**



చిత్తూరు, అక్టోబర్ 6: (మహి న్యూస్): ఎస్‌ఎస్‌సీ--2027లో మెరుగైన ఫలితాలు సాధించేలా 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్




కుమార్ అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. జడ్పీ కార్యాలయంలోని ఎన్టీఆర్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన విద్యా ప్రమాణాల మెరుగుదల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను ముందుగానే గుర్తించి ప్రత్యేక ట్రాకింగ్ షీట్లు రూపొందించాలని సూచించారు. 6 నుంచి 10వ తరగతి వరకు గణితం, సైన్స్, ఇంగ్లీష్‌లో ప్రాథమిక భావనలను బలోపేతం చేయాలని తెలిపారు. వారానికొకసారి స్లిప్ టెస్టులు, నెలవారీ యూనిట్ పరీక్షలు, త్రైమాసిక ఉమ్మడి పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని పర్యవేక్షించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రతిరోజూ గంటపాటు ప్రత్యేక నివారణాత్మక తరగతులు, వారాంతాలు, సెలవు రోజుల్లో అదనపు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఉత్తమ



ఉపాధ్యాయులతో మండల స్థాయిలో సబ్జెక్టు వారీగా మెంటరింగ్ నిర్వహించాలని, ప్రశ్నా బ్యాంకులు, నమూనా సమాధానాలు సిద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దీర్ఘకాలంగా గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను వెంటనే సంప్రదించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ విద్యా కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ, వారానికొకసారి విద్యార్థుల పురోగతిని సమీక్షించాలన్నారు. తక్కువ ఫలితాలు సాధిస్తున్న మండలాలు, పాఠశాలలను గుర్తించి ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ చేపట్టాలని, తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి విద్యార్థుల చదువు, హాజరు, పరీక్షల సన్నద్ధతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఈఓ లక్ష్మీనారాయణ, డిప్యూటీ డీఈవోలు ఇందిర, మహేశ్వరరావు, ఎస్ఎస్‌పీఓ ప్రతినిధి వెంకటరమణ, ఇండియన్ రెడ్‌క్రాస్ అధ్యక్షుడు తేజమూర్తి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పారామెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఎస్వీ వైద్య కళాశాలలో 60 సీట్లు అందుబాటులో**

**బైపీసీ, ఎంపీసీ ఇంటర్ ఉత్తీర్ణులకు అవకాశం**

**దరఖాస్తులకు చివరి తేదీ అక్టోబర్ 14**

**తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల విద్యార్థులకు అవకాశం**



తిరుపతి, అక్టోబర్ 6: (మహి న్యూస్): తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి రెండేళ్ల కాలవ్యవధి గల పారామెడికల్ (అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్) డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవి ప్రభు తెలిపారు. బైపీసీ లేదా ఎంపీసీ విభాగంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాలలో మొత్తం 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారాన్ని ఏపీపీఎంబీ (ఞఞఞ.ఖజాజూఎఎ.ఏ.ఞ్శ.ఱఅ) లేదా ఏపీఎస్ఏహెచ్‌పీసీ (ఖజాయిఖ్ష్ర-జూఎ.ఏ.ఞ్శ.ఱఅ) వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తును రూ.100 రుసుముతో అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటల్లోపు ఎస్వీ వైద్య కళాశాల పారామెడికల్ విభాగంలో సమర్పించాలి. దరఖాస్తుల పరిశీలన అనంతరం తుది జాబితాను విడుదల చేస్తామని కళాశాల అధికారులు తెలిపారు. కోర్సుల నిబంధనలు, అర్హతలు, ఇతర వివరాలను దరఖాస్తు ఫారంతో పాటు పరిశీలించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 09440879943 నంబర్‌ను సంప్రదించవచ్చు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎన్. మాధవీలత, అలైడ్ అండ్ హెల్త్ సైన్సెస్ విభాగం ఇన్‌చార్జి నీలా రెడ్డి, పీఆర్వో వీరకిరణ్ పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


# శుభ్రత భేష్.. వ్యాపారులకు కమిషనర్ శభాష్

## కొండారెడ్డి బురుజు పూల మార్కెట్ పరిశుభ్రతపై కమిషనర్ సంతృప్తి

## మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వ్యాపారులకు సూచన



కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): కొండారెడ్డి బురుజు పూల మార్కెట్‌లో పరిశుభ్రత మెరుగుపడటంపై నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుతున్న వ్యాపారులను అభినందిస్తూ ప్రశంసించారు. కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మార్కెట్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. చెత్త సేకరణ కోసం ప్రత్యేక ట్రాలీ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికుడిని నియమించారు. వ్యాపారులకు పలుమార్లు సూచనలు చేసినప్పటికీ మార్పు లేకపోవడంతో జరిమానాలు కూడా విధించారు. ఈ చర్యల ఫలితంగా ప్రస్తుతం మార్కెట్‌లో పరిశుభ్రత గణనీయంగా మెరుగుపడింది. మంగళవారం మార్కెట్‌ను పరిశీలించిన కమిషనర్.. దుకాణాల పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని, ప్రతిరోజూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వ్యాపారులకు సూచించారు. ప్రస్తుతం సాధించిన పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని కోరారు. అంతకుముందు కమిషనర్ వెంకటరమణ కాలనీలో పారిశుధ్య పనులు, చెత్త బదిలీ కేంద్రం, కొండారెడ్డి బురుజు అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, వాహనాల ఇన్‌చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



# కర్నూలు జిల్లాలో 27 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ప్రారంభం

## రాష్ట్రవ్యాప్తంగా 267 కేంద్రాలకు శ్రీకారం

## 12 రకాల వైద్య సేవలు.. 14 రకాల పరీక్షలు

## 105 రకాల మందులు ఉచితంగా అందుబాటులోకి

## గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యం



కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 267 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ఆరోగ్య--సంక్షేమ కేంద్రాలను మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కృష్ణా జిల్లా జనార్ధనపురం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 27 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. కర్నూలు సునయన ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ప్రాథమిక వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి సమీపంలోనే వైద్య సేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక వైద్యం, ఆరోగ్య పరీక్షలు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, చికిత్స, ఆరోగ్య అవగాహన వంటి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ అవసరమైన వారికి సకాలంలో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కర్నూలు జిల్లాలో ప్రారంభమైన 27 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు ఉచితంగా అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమీపంలోని కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యాంబాబు, కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి 27 కేంద్రాలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. యాటకల్లు, ములుగుందం-1, కొత్తకోట-2 (ఈర్లదిన్నె), ఎనగండ్ల, దౌలతపురం, గుమ్మనూరు, పంచాలింగాల-2, ఉల్చాల-2, గొందిపర్ల, ఇంగలదహాళ్, శ్రీరంగాపురం, ప్యాలకుర్తి, చిన్నహ్యాట్, హోళగుంద-1, ముసనహల్లి, మానేకుర్తి, కురుకుంద, తలగోకులపాడు, ఎర్రదొడ్డి, ఉయ్యాలవాడ, మునగాల, పోలేకల్, రత్నపల్లి, వెల్దుర్తి-1, రామళ్లకోట, రాంపల్లి, పెండకల్ గ్రామాల్లో ఈ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా. కామేశ్వర ప్రసాద్, డీసీహెచ్ డా. జఫ్రాల, డీటీసీఓ డా. భాస్కర్, జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ నాగేశ్వర యాదవ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని వరుణ యాగం

## కొత్తూరులో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

## రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష

## జలవనరులు నిండాలని వేద పండితుల ఆధ్వర్యంలో యాగం



కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): పాణ్యం నియోజకవర్గం కొత్తూరు గ్రామంలోని కొత్తూరు క్షేత్రం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన యాగంలో యువ నాయకుడు గౌరు జనార్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతి అనుకూలంగా ఉండి సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు కళకళలాడాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. పాణ్యం నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జలవనరులు నిండాలని, రైతాంగానికి మేలు జరగాలని ఆకాంక్షించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, వేద పండితులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# కల్లూరును వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి

## రైతులతో కలిసి జాయింట్ కలెక్టర్‌కు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి వినతి

## వర్షాభావంతో చెరువులు ఎండిపోయి.. బావులు అడుగంటిన పరిస్థితి

## పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందించాలని డిమాండ్

## రైతు రుణాల రీషెడ్యూల్‌తో పాటు వడ్డీ మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి



కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): కల్లూరు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి డిమాండ్ చేశారు. కల్లూరు మండల రైతులతో కలిసి కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడంతో చెరువులు ఎండిపోయి, బావులు అడుగంటిపోయాయని, పంటలు సరిగా మొలకెత్తకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే తెలిపారు. ఎకరాలకు ఎకరాలు పంటలు ఎండిపోవడంతో పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందన్నారు. పశువులకు మేత, తాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కల్లూరు మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, కరువు మండలంగా అధికారికంగా ప్రకటించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని, ఉచిత పంటల బీమా వర్తింపజేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలను రీషెడ్యూల్ చేసి వడ్డీ మినహాయింపు ఇవ్వడంతో పాటు, ఉపాధి హామీ పథకంలో పని దినాలను పెంచి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణకు పకడ్బందీ చర్యలు

## స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

## కార్మికుల భద్రతలో రాజీ వద్దు

## సామాజిక బాధ్యతతో ప్రజలకు మేలు చేయాలి

## ఏపీపీసీబీ చైర్మన్ డా. పి.కృష్ణయ్య

కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ



మండలి చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. పి.కృష్ణయ్య సూచించారు. ఓర్వకల్లు మండలం గుట్టపాడు సమీపంలోని జై రాజ్




ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌ను మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరితో కలిసి పరిశీలించారు. పరిశ్రమలో కాలుష్య నియంత్రణ చర్యలు, పచ్చదనం పెంపు, స్థానికులకు ఉపాధి కల్పన తదితర అంశాలపై యాజమాన్యంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డా. పి.కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక యువత, డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. వారికి బ్యాంకు రుణాలు, ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిశ్రమల సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలకు, స్థానిక పరిపాలనకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు, భద్రతా తనిఖీలు, క్రమం తప్పకుండా



నమూనా విన్యాసాలు నిర్వహించాలని ఆదేశించారు. పర్యావరణ నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. పరిశ్రమల ప్రాంగణాల్లో పచ్చదనం పెంచడంతో పాటు నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి మాట్లాడుతూ పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనంతరం ఏపీపీసీబీ చైర్మన్, కలెక్టర్ పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు.

కార్యక్రమంలో జై రాజ్ ఇస్పాత్ ఎండీ గోయంకా, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం మధుసూదన్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, జై రాజ్ ఇస్పాత్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ ఆటోలతో చెత్తసేకరణ మరింత పటిష్టం

## కర్నూలులో ఇంటింటి చెత్తసేకరణలో 5.6 శాతం మెరుగుదల

## 91 ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరు.. ఇప్పటికే 40 అందుబాటులోకి

## రూ.8 కోట్లతో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం

## మూడు నెలల్లో 100 శాతం ఇంటింటి చెత్తసేకరణే లక్ష్యం

కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): కర్నూలు నగరంలో ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా ఇంటింటి చెత్తసేకరణ మరింత పటిష్టంగా జరుగుతోందని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి




పట్టాభిరామ్ తెలిపారు. ఇంటింటి చెత్తసేకరణపై ప్రజాభిప్రాయంలో



5.6 శాతం మెరుగుదల నమోదైందన్నారు. మంగళవారం వెంకటరమణ కాలనీలో విశాల్ మార్ట్ వెనుక, జొహరాపురం రోడ్డులోని చెత్త బదిలీ కేంద్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ 100 శాతం ఇంటింటి చెత్తసేకరణ లక్ష్యంగా నిర్ణీత మార్గాల్లో ఎలక్ట్రిక్ ఆటోలు ప్రతిరోజూ ఇళ్ల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాయని తెలిపారు. కర్నూలుకు 91 ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరు కాగా, ఇప్పటికే 40 అందుబాటులోకి వచ్చాయని, మిగిలినవి ఈ నెలాఖరులోగా వస్తాయని చెప్పారు. నగరంలో రోజుకు సుమారు 225 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు గార్గేయపురం డంప్‌యార్డులో 9.5 ఎకరాల్లో రూ.8 కోట్లతో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా రోజుకు 200 మెట్రిక్ టన్నుల చెత్తను శాస్త్రీయంగా పునర్వినియోగానికి అనువుగా మార్చేలా చర్యలు



చేపడుతున్నామన్నారు. మరో ఏడాదిన్నరలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రం నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో కర్నూలులో 100 శాతం ఇంటింటి చెత్తసేకరణ సాధించడమే లక్ష్యమన్నారు. ప్రజలు కూడా ఇళ్ల వద్ద తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసుకునే విధానాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం జొహరాపురం డంప్‌యార్డులో కొనసాగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను పరిశీలించిన చైర్మన్.. మిగిలిన 1.18 లక్షల మెట్రిక్ టన్నుల బయోమైనింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బయోమైనింగ్ పూర్తయిన స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డా. ఎం. రఘు, పబ్లిక్ హెల్త్ ఎంఈ గుర్రప్ప యాదవ్, నగరపాలక సంస్థ ఎంఈ గిరిరాజ్, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, ఏఈ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.




# స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

## నైపుణ్య శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలి

## బంగనపల్లి మామిడితో పానీయాల తయారీపై పరిశీలన చేయాలి

## నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి

## ఏపీపీసీబీ చైర్మన్ డా. పి.కృష్ణయ్య

కర్నూలు, అక్టోబర్ 6: (మహి న్యూస్): పరిశ్రమల్లో స్థానిక



యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్,



రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. పి.కృష్ణయ్య సూచించారు. ముఖ్యంగా పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన కుటుంబాలు, గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లిలోని రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ పానీయాల తయారీ కేంద్రాన్ని మంగళవారం డా. పి.కృష్ణయ్య, జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి కలిసి పరిశీలించారు. కాలుష్య నియంత్రణ చర్యలు, ఉపాధి కల్పన, పానీయాల తయారీ ప్రక్రియ తదితర అంశాలపై పరిశ్రమ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డా. పి.కృష్ణయ్య మాట్లాడుతూ మామిడి పానీయాల తయారీలో తోతాపురి, అల్ఫోన్సో రకాలతో పాటు కర్నూలు ప్రాంతంలో విస్తారంగా లభించే బంగనపల్లి మామిడిని వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. స్థానిక రైతుల నుంచి బంగనపల్లి మామిడిని సేకరించి, దాని రుచి, నాణ్యతను పరిగణనలోకి తీసుకుని అల్ఫోన్సోకు ప్రత్యామ్నాయంగా లేదా మిశ్రమంగా వినియోగించే అంశంపై పరిశోధన చేయాలని తెలిపారు. స్థానిక మామిడి రకాలకు పరిశ్రమల్లో ప్రాధాన్యత కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

పానీయాల తయారీలో నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని యాజమాన్యానికి సూచించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని తెలిపారు. పర్యావరణ అనుమతుల నిబంధనల ప్రకారం ప్రభావిత గ్రామాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కేటాయించే నిధులను స్థానిక ప్రజల వాస్తవ అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు. గ్రామ ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి మాట్లాడుతూ నైపుణ్యాల



కొరత స్థానిక యువతకు ఉద్యోగాల్లో అడ్డంకిగా మారకుండా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. అనంతరం చైర్మన్, కలెక్టర్ పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు పానీయాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం మధుసూదన్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగంలో నంద్యాలను ముందంజలో నిలపాలి

## పదో తరగతి ఫలితాల మెరుగుదలకు 'మిషన్ మార్చి-2027' పకడ్బందీగా అమలు చేయాలి

## మనబడి, నాడు-నేడు, పీఎం శ్రీ పాఠశాలల పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

## విద్యార్థుల హాజరు, డ్రాపౌట్లపై ప్రత్యేక దృష్టి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, అక్టోబర్ 6: (మహి న్యూస్): విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసి నంద్యాల జిల్లాను విద్యలో ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంగళవారం పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారులతో విద్యా కార్యక్రమాలు, విద్యార్థులు--




ఉపాధ్యాయుల హాజరు, పదో తరగతి ఫలితాలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమోదు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. మనబడి, నాడు--నేడు, పీఎం శ్రీ పాఠశాలల నిర్మాణం, మౌలిక వసతులు, ఆడిటోరియం పనులను అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంజూరైన నిధులను నిబంధనల ప్రకారం సకాలంలో వినియోగించి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. నిధుల వినియోగం సక్రమంగా ఉంటేనే తదుపరి విడత నిధులు సకాలంలో అందే అవకాశం ఉంటుందని తెలిపారు. పదో తరగతి ఫలితాల మెరుగుదలకు లి'మిషన్ మార్చి--2027'లిను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల గైర్హాజరు, డ్రాపౌట్లకు కారణాలను గుర్తించి వాటిని నివారించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో పాఠశాలల పరిస్థితులను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. విద్యాశాఖకు సంబంధించిన ప్రాధాన్యతా కార్యక్రమాల అమలులో వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. స్కిల్ హబ్‌లలో శిక్షణ కార్యక్రమాలు లక్ష్యాలకు అనుగుణంగా నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి, వయోజన విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సమగ్ర శిక్ష అధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎంప్లాయిమెంట్ అధికారి సోమ శివారెడ్డి, ఆర్ఏఓ శంకర్ నాయక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు

గాలివీడు:అక్టోబర్06(మహి న్యూస్ ): విద్యార్థినితో అనుచితంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వెలిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (బీఎస్) జి. వెంకటేశ్వర్లుపై జిల్లా విద్యాశాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి డా. కె. సుబ్రహ్మణ్యం ఈనెల 5న ఉత్తర్వులు జారీ చేశారు.అదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బాలిక విద్యార్థినికి అనుచిత సందేశాలు పంపడంతో పాటు ఫోన్ కాల్స్ చేశారన్న ఆరోపణలు ఆయనపై వచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అక్టోబర్ 3న వెలువడిన వార్తా కథనాలతో విచారణ చేపట్టిన రాయచోటి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ విచారణ అనంతరం సమర్పించిన నివేదికల ఆధారంగా ఈనిర్ణయం తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.అంతేగాక ఉపాధ్యాయుడి వ్యవహారం విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యానికి, సర్వీస్ కండక్ట్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలడంతో ఆయనపై క్రమశిక్షణా చర్యలు చేపట్టారు. క్రమశిక్షణా విచారణ పూర్తయ్యే వరకు తక్షణం అమలులోకి వచ్చే విధంగా వెంకటేశ్వర్లును సస్పెండ్ చేశారు.

# చిన్న గాలివానకే కరెంట్ కట్

## గాలివీడు ప్రజలకు తప్పని విద్యుత్ కష్టాలు

గాలివీడు: అక్టోబర్ 6 (మహి న్యూస్): మండలంలో విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి గాలివాన వచ్చినా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతుండటంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళ కరెంట్ లేకపోవడంతో ఉక్కపోతతో అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. సమస్యపై అధికారులకు సమాచారం అందించినా సరఫరా పునరుద్ధరణకు ఎక్కువ సమయం పడుతోందని పేర్కొంటున్నారు. విద్యుత్ లైన్లు, స్తంభాలు, పరికరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, తరచూ ఏర్పడుతున్న అంతరాయాలకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బాలింతలకు మంచి పౌష్టిక ఆహారం అందించాలన్నదే

# కూటమి ప్రభుత్వ ధ్యేయం



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 06 : బాలింతలకు మంచి పౌష్టిక ఆహారం అందించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని టీడీపీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా, రాయచోటి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శ్రీనివాస్ కుమార్ రాజు అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణ కేంద్రంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంగా ఉండాలని వారి సంక్షేమానికి శ్రీకారం చుట్టారన్నారు.

## గ్రామీణ ప్రజలకు మరింత చేరువగా ప్రాథమిక వైద్య సేవలు

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 6: గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలను స్థానికంగానే మరింత చేరువగా అందుబాటులోకి తీసుకువచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కృష్ణా జిల్లా గుడివాడ నియోజకవర్గంలోని జనార్ధనపురం నుంచి వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రాష్ట్రం వ్యాప్తంగా 24 జిల్లాలలో 83 నియోజకవర్గాలలోని 267నూతన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్--విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను వర్చువల్‌గా ప్రారంభించారు. మదనపల్లె కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్. సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అన్నమయ్య జిల్లాలో నిర్మించిన మూడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్--విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల శిలాఫలకాలను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గాలివీడు మండలం తూముకుంట గ్రామంలో రూ. 16.50 లక్షలు, లక్కిరెడ్డిపల్లి మండలం లక్కిరెడ్డిపల్లి గ్రామంలో రూ.11 లక్షలు, పెద్దమండ్యం మండలం సత్తి ఓబన్నగారిపల్లిలో రూ. 17.88 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మూడు భవనాలను ప్రారంభించినట్లు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో మొత్తం రూ. 45.38 లక్షల అంచనా వ్యయంతో ఈ భవనాలను నిర్మించినట్లు వివరించారు. గ్రామీణ ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి గ్రామంలోనే ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడమే విలేజ్ హెల్త్ క్లినిక్స్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఆరోగ్య కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని, చిత్తశుద్ధితో వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్లినిక్స్‌లో ఎం.ఎల్.హెచ్.పి., ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా ఆరోగ్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులు, 14 రకాల ప్రాథమిక వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అవసరమైన రోగులను సమీప పీహెచ్‌సీ లేదా ఉన్నత స్థాయి వైద్య కేంద్రాలకు రిఫర్ చేసే సదుపాయం ఉంటుందన్నారు. తల్లి--శిశు ఆరోగ్యం, సాధారణ వ్యాధుల గుర్తింపు--చికిత్స, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఆరోగ్య అవగాహన, నివారణాత్మక ఆరోగ్య సేవలు తదితరాలను గ్రామస్థాయిలోనే అందించేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వై. శ్రీనివాసులు డీపీఎంఓ డాక్టర్ బి. రమేష్ బాబు, డీఎంఓ డాక్టర్ వెంకటరమణ రెడ్డి, వైద్య సిబ్బంది, ఎం.ఎల్.హెచ్.పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిక్షణ పొందిన మధ్యవర్తులకు అవగాహన




## న్యాయమూర్తులతో పరస్పర చర్చ

కడప, అక్టోబర్ 6, మహి న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మధ్యవర్తులకు అవగాహనా సమావేశం, మధ్యవర్తిత్వానికి కేసులను సూచించే న్యాయమూర్తులతో పరస్పర చర్చా సమావేశం నిర్వహించారు. మొదటి కార్యక్రమాన్ని న్యాయ సేవా సదన్‌లో శిక్షణ పొందిన మధ్యవర్తులకు నిర్వహించగా, రెండవ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో మధ్యవర్తిత్వానికి కేసులను సూచించే న్యాయమూర్తులతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ సమక్షంలో జరిగాయి. సుప్రీంకోర్టు శిక్షకురాలు విజయ కమల శిక్షణ పొందిన మధ్యవర్తులకు మధ్యవర్తిత్వ ప్రక్రియ, మధ్యవర్తుల బాధ్యతలు, కక్షిదారులతో వ్యవహరించే విధానం, పరస్పర అంగీకారంతో వివాదాల పరిష్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రెండవ కార్యక్రమంలో న్యాయమూర్తులతో మధ్యవర్తిత్వానికి అనుకూలమైన కేసులను గుర్తించడం, వాటిని మధ్యవర్తిత్వానికి సూచించడం, కేసుల సత్వర పరిష్కారంలో మధ్యవర్తిత్వం ప్రాధాన్యత తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ మాట్లాడుతూ, మధ్యవర్తిత్వానికి అనుకూలమైన కేసులను గుర్తించి, వాటిని మధ్యవర్తిత్వ ప్రక్రియకు సూచించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారుల మధ్య సఖ్యత పెంపొందడంతో పాటు సమయం, వ్యయం ఆదా అవుతాయని తెలిపారు. శిక్షణ పొందిన మధ్యవర్తులు తమకు అందించిన శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, కక్షిదారుల నమ్మకాన్ని పొందే విధంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం న్యాయమూర్తులతో మధ్యవర్తిత్వానికి సంబంధించిన వివిధ అంశాలపై పరస్పర చర్చ నిర్వహించారు. మధ్యవర్తిత్వానికి అనుకూలమైన కేసులను గుర్తించడం, కేసులను మధ్యవర్తిత్వానికి సూచించడం, మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్, న్యాయమూర్తులు, శిక్షణ పొందిన మధ్యవర్తులు పాల్గొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మధ్యవర్తులకు అవగాహనా సమావేశం, మధ్యవర్తిత్వానికి కేసులను సూచించే న్యాయమూర్తులతో పరస్పర చర్చా సమావేశం నిర్వహించారు. మొదటి కార్యక్రమాన్ని న్యాయ సేవా సదన్‌లో శిక్షణ పొందిన మధ్యవర్తులకు నిర్వహించగా, రెండవ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో మధ్యవర్తిత్వానికి కేసులను సూచించే న్యాయమూర్తులతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ సమక్షంలో జరిగాయి. సుప్రీంకోర్టు శిక్షకురాలు విజయ కమల శిక్షణ పొందిన మధ్యవర్తులకు మధ్యవర్తిత్వ ప్రక్రియ, మధ్యవర్తుల బాధ్యతలు, కక్షిదారులతో వ్యవహరించే విధానం, పరస్పర అంగీకారంతో వివాదాల పరిష్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రెండవ కార్యక్రమంలో న్యాయమూర్తులతో మధ్యవర్తిత్వానికి అనుకూలమైన కేసులను గుర్తించడం, వాటిని మధ్యవర్తిత్వానికి సూచించడం, కేసుల సత్వర పరిష్కారంలో మధ్యవర్తిత్వం ప్రాధాన్యత తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ మాట్లాడుతూ, మధ్యవర్తిత్వానికి అనుకూలమైన కేసులను గుర్తించి, వాటిని మధ్యవర్తిత్వ ప్రక్రియకు సూచించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారుల మధ్య సఖ్యత పెంపొందడంతో పాటు సమయం, వ్యయం ఆదా అవుతాయని తెలిపారు. శిక్షణ పొందిన మధ్యవర్తులు తమకు అందించిన శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, కక్షిదారుల నమ్మకాన్ని పొందే విధంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం న్యాయమూర్తులతో మధ్యవర్తిత్వానికి సంబంధించిన వివిధ అంశాలపై పరస్పర చర్చ నిర్వహించారు. మధ్యవర్తిత్వానికి అనుకూలమైన కేసులను గుర్తించడం, కేసులను మధ్యవర్తిత్వానికి సూచించడం, మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్, న్యాయమూర్తులు, శిక్షణ పొందిన మధ్యవర్తులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ...!

## రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

## ప్రతి 2,500 మందికి ఒక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

## కడప జిల్లాలో ఐదు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభం




కడప, మహి న్యూస్ అక్టోబరు 6: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను విస్తరిస్తోందని రాష్ట్ర వైద్య



ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 'ఆరోగ్యం పరమం ధనం' కార్యక్రమంలో భాగంగా.. మంగళవారం గుడివాడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 165 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)లను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జిల్లాలో జమ్మలమడుగు డివిజన్‌లోని దేవగుడి-2, బొమ్మేపల్లి, పెద్ద దండ్లూరు, దొరసానిపల్లి, కడప డివిజన్‌లోని చీమలపెంట విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కడప జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సభాభవనం నుంచి అధికారులు, వైద్య సిబ్బంది వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ప్రతి గ్రామీణ కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆరోగ్య మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని మంత్రి వర్చువల్ ద్వారా తెలుపుతూ.. హెల్త్ క్లినిక్ ల ప్రారంభోత్సవం చేసుకున్న జిల్లాలు, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి



ఆకాంక్షించారు. వర్చువల్ కార్యక్రమం అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్ మాట్లాడుతూ... ప్రతి 2,500 మంది జనాభాకు ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా 104 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు, 71 రకాల వైద్య పరికరాలతో ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఎం.ఎల్.హెచ్.పి., ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా మాతా శిశు ఆరోగ్య సేవలు, టీకాలు, సంక్రమణ, అసంక్రమిత వ్యాధుల నివారణతో పాటు మొత్తం 12 రకాల ఆరోగ్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను సద్వినియోగం చేసుకోవాలని, వీటి ద్వారా ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ మద్దయ్య మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం 40 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఐదు కేంద్రాలను సోమవారం ప్రారంభించామని, మిగిలిన 35 కేంద్రాలను డిసెంబర్ 2026 నాటికి అన్ని సౌకర్యాలతో




పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటులో వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మహమ్మద్ తాహా, డాక్టర్ గీత, డాక్టర్ మల్లేష్, డాక్టర్ ఖాజామొహిద్దీన్, డాక్టర్ చెన్నారెడ్డి, డెమో భారతి, జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి, వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ శాఖల్లో జిల్లా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## పెండింగ్ పనులకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి

మదనపల్లి, మహి న్యూస్, అక్టోబర్ 6: జిల్లాలో ఇంజనీరింగ్ శాఖల్లో చేపట్టిన జిల్లా అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత కాలపరిమితి లోగా పనుల పూర్తికి చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మదనపల్లి కలెక్టరేట్ భారత్ సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి, మౌలిక వసతుల పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ఇందులో మంజూరైన పనులు, పూర్తి చేసినవి, ప్రగతిలో ఉన్నవి, ఇంకను ప్రారంభించనివి, మంజూరైన నిధులు, ఖర్చు చేసినవి తదితరాలపై సమీక్షించి, పెండింగ్ పనులు, భూసేకరణ, సాంకేతిక సమస్యలు, పరిష్కార మార్గాలు, టెండర్ దశలో ఉన్న పనులు, నిధుల వినియోగం తదితర అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పనులపై సమీక్ష

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో వివిధ పథకాల కింద అంచనా వ్యయం రూ. 996.75 కోట్ల తో మొత్తం 3,227 పనులు చేపట్టగా, 2,808 పనులు గ్రౌండింగ్ కాగా, 2,406 పనులు పూర్తయ్యాయి, 402 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ఎంజిఎన్ఆర్ఈజిఎస్ పల్లె పండుగ-1 కింద 2024-25లో మంజూరైన 1,084 పనుల్లో 1,018 పనులు పూర్తయ్యాయి. 2025-26లో పల్లె పండుగ హాలో మంజూరైన 1,028 పనుల్లో 566 పనులు పూర్తయ్యాయి. పీఎం.జి.ఎస్.వై-III కింద 20 పనులకు గాను 14 పనులు పూర్తికాగా, 6 పనులు పురోగతిలో ఉన్నాయి. నాబార్డు కింద 10 పనుల్లో 7 పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. పల్లె పండుగ 3.0లో చేపట్టిన పనులను డిసెంబరు 31 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పల్లె పండుగ 1.0, 2.0లో మంజూరై ఇంకా ప్రారంభించని పనులను రద్దు చేసే ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలన్నారు. పనులలో జాప్యం ఉన్న చోట కారణాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

### గ్రామీణ తాగునీటి సరఫరా

గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ పరిధిలోని పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 25 మండలాలు, 411 గ్రామ పంచాయతీలు, 4,550 ఆవాసాలు ఉండగా, 11.39 లక్షల గ్రామీణ జనాభాకు త్రాగునీటి అందించేలా కృషి చేస్తున్నామని అధికారులు వివరించారు. తాగునీటి పనుల్లో డీఎంఎఫ్, ఎంపిలాడ్స్ తదితర నిధుల కింద చేపడుతున్న పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. పాత డీఎంఎఫ్ కింద 613 పనుల్లో 495 పూర్తికాగా, 64 పనులు పురోగతిలో ఉన్నాయి. ఎంపిలాడ్స్ కింద 349 పనుల్లో 240 పనులు పూర్తయ్యాయి. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చూడాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించుకొని, అవసరాలను దృష్టిలో ఉంచుకుని బోర్లు, పైప్‌లైన్లు, నీటి సరఫరా వ్యవస్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

### విద్యుత్ మౌలిక వసతులు

ఏపీ ఎస్పీడీసీఎల్, ఏపీ ట్రాన్స్కో పరిధిలో విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్లు, లైన్లు, రెనోవేషన్ అండ్ మోడర్నైజేషన్ పనుల పురోగతిని సమీక్షించారు. ఏపీ ట్రాన్స్కో మదనపల్లి ాడవీ పరిధిలో 220 ఖఎ, 132 ఖఎ సబ్‌స్టేషన్లు, జుఞ లైన్ల సామర్థ్యం, =వీ× పనుల స్థితిగతులను అధికారులు వివరించారు. =వీ× పథకంలో 31 పనులకు మంజూరు కాగా 30 పనులు పూర్తయ్యాయని, 2023-24లో 8 పనులకు గాను 7 పనులు పూర్తయ్యాయని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అవసరమైన మరమ్మతులు, ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని, సూర్యఘర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### రహదారుల పనులపై ప్రత్యేక దృష్టి

రోడ్లు, భవనాల శాఖ పరిధిలో రాష్ట్ర రహదారులు, ప్రధాన జిల్లా రహదారులు, పీఎం.జిఎస్.వై, నాబార్డు తదితర పథకాల కింద చేపడుతున్న పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. పీఎం.జిఎస్.వై-III కింద మొత్తం 20 పనుల్లో 14 పూర్తికాగా, 6 పనులు పురోగతిలో ఉన్నాయి. నాబార్డు-శశశ కింద 10 పనుల్లో 7 పనులు పూర్తయ్యాయి. ఏపిఆర్ఆర్ఎస్పి కింద 36 పనులకు సంబంధించి 12 పనులు గ్రౌండింగ్ కాగా, మిగిలిన పనులు ప్రారంభ దశలో ఉన్నట్లు అధికారులు వివరించారు. రహదారుల పనుల్లో భూసేకరణ, అనుమతులు, ఇతర శాఖల నుంచి అవసరమైన సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రజలకు, రైతులకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా రహదారి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

### జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలి

జిల్లాలో జాతీయ రహదారుల పరిధిలో కొనసాగుతున్న పనులను కూడా సమీక్షించారు. రాయచోటి బైపాస్ ప్రాంతంలో భూసంబంధిత సమస్యలు, అదనపు భూసేకరణ, రహదారి పనులకు ఆటంకంగా ఉన్న నిర్మాణాల తొలగింపు వంటి అంశాలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ సమస్యలను సంబంధిత రెవెన్యూ, జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రాయచోటి--కడప చీం-40 పరిధిలో ప్రతిపాదిత టన్నెల్ పనికి సంబంధించిన మట్టి పరీశీలన ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

### సాగునీటి వనరులు, చిన్నతరహా నీటి వనరులపై దృష్టి

ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్ శాఖల పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. చెరువులు, నీటి వనరులు, సాగునీటి సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేసి రైతులకు ప్రయోజనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డ్వామా పరిధిలో సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ఎన్ఎంఎంఎస్ లక్ష్యం 12.50 లక్షల పని దినాలుగా ఉండగా, 7.72 లక్షల పని దినాలు సాధించి 61.79 శాతం ప్రగతి సాధించినట్లు అధికారులు వివరించారు. ప్రణాళికాబద్ధంగా విస్తృతంగా పనులు కల్పించి, లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు.

### ప్రజా ఆరోగ్య, విద్యా మౌలిక వసతుల పనులు

పబ్లిక్ హెల్త్, ఏపిఈడబ్ల్యుఐడిసి పరిధిలో ఆసుపత్రులు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లు, ఇతర ప్రజా మౌలిక వసతుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. మదనపల్లిలో అమృత్-1.0 కింద 5 మీణ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు 90 శాతం పూర్తయ్యాయని, ఎలక్ట్రో మెకానికల్ పరికరాల ఏర్పాటు పూర్తికాగా మోటార్ల ఫిక్సింగ్ పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. నవంబర్ 2026 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే భవనాలు, ఆరోగ్య, విద్యా మౌలిక వసతుల పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

### పెండింగ్ పనులపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

అన్ని శాఖల్లో పనుల పురోగతి, పూర్తి చేసిన పనులు, పురోగతిలో ఉన్నవి, ప్రారంభం కానివి, టెండర్ దశలో ఉన్నవి, భూసేకరణ మరియు ఇతర కారణాలతో పెండింగ్‌లో ఉన్న పనులపై సమగ్రంగా చర్చించారు. పనులు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను స్పష్టంగా గుర్తించి, ప్రతి పనికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక శాఖకు సంబంధించిన సమస్య మరో శాఖతో సంబంధం కలిగి ఉంటే పరస్పర సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

### పనుల్లో జాప్యాన్ని సహించబోం

అభివృద్ధి పనుల్లో అనవసర జాప్యాన్ని సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే రహదారులు, తాగునీరు, విద్యుత్, సాగునీరు, పాఠశాలలు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతుల పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి శాఖ నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులో సాధించేలా నిరంతరం పర్యవేక్షించాలని, పనుల నాణ్యతలో రాజీ లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించలేని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి ఇంజనీరింగ్ శాఖలు కీలకమని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేస్తే ప్రజలకు మౌలిక వసతుల ప్రయోజనాలు త్వరితగతిన అందుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా ఇంజనీరింగ్ శాఖల జిల్లా అధికారులు, ఈఈలు, డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగంలో జిల్లాను ముందంజలో నిలపాలి

## మౌలిక వసతుల నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 6: జిల్లాలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందించేలా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పాఠశాల విద్యాశాఖ పనితీరు, విద్యా కార్యక్రమాల అమలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పదో తరగతి ఫలితాల మెరుగుదల, ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమోదు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో విద్యా రంగానికి సంబంధించిన వివిధ అభివృద్ధి పనులు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నిధుల వినియోగం, విద్యార్థుల ప్రవేశాలు, బడి బయట ఉన్న పిల్లలు, విద్యార్థుల హాజరు, డ్రాపౌట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. మనబడి, నాడు-నేడు, పీఎం శ్రీ పాఠశాలల నిర్మాణం, మౌలిక వసతుల పనులతో పాటు ఆడిటోరియం నిర్మాణాలను కూడా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన నిధులను



నిబంధనల ప్రకారం సకాలంలో వినియోగించి, పనుల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. నిధుల వినియోగం సక్రమంగా జరిగితేనే కేంద్ర ప్రభుత్వం నుంచి తదుపరి విడత నిధులు సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌కు సంబంధించిన ఐదు కాంపోనెంట్ల కింద, అలాగే మనబడి--మన భవిష్యత్తు పథకం కింద పాఠశాలల్లో మిగిలి ఉన్న నిధులను సద్వినియోగం చేసుకుని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మేజర్, మైనర్ మరమ్మతు పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సదుపాయం, తాగునీటి వసతి తదితర మౌలిక వసతులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిస్థాయిలో కల్పించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. పనుల వాస్తవ పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతుల స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించి, సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో పదో తరగతి ఫలితాల మెరుగుదలకు మిషన్ మార్చి-2027ను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల గైర్హాజరు, డ్రాపౌట్లకు గల కారణాలను గుర్తించి, వాటిని నివారించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖకు సంబంధించిన ప్రాధాన్యతా కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేసేందుకు వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. విద్యాశాఖకు సంబంధించిన అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష అధికారిణి అనురాధ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com